నేటి దినపత్రిక
# సూర్య
గురువారం
1 ఫిబ్రవరి
2024
పేజీలు 8
# అమరావతి
గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్


## దళారుల రాజ్యంలో...
# బ్రతుకులు ఛిద్రం

మధ్యతరగతి అధోగతి....!

బ్రతుకుతెరువు కోసం చిన్న కుటుంబాల ఆరాటం

అదుపుతప్పిన నిఘా, నియంత్రణ - మార్కెట్‌ను గాలికొదిలేశారు

వ్యాపారులదే ఇష్టారాజ్యం - దూరదృష్టి లేని సర్కార్

మధ్య తరగతికి కుటుంబాలపై ధరల భారం పడి ఆర్థికంగా చిక్కి శల్య మవుతున్నాయి. ఉపాధి లేక నెలవారీ ఖర్చులు పెరిగిపోయి ఆర్థిక ఊబిలో కూరుకు పోతున్నాయి. రేయింబవళ్ళు కష్టపడినా అతని తలరాత మాత్రం మారడం లేదు. అప్పుల భారంతో కుంగిపోతున్న కుటుంబాలు కోకొల్లలుగా బ్రతుకు భారంగా మారటంతో ఉన్న ఆస్తులు అమ్మేసి కొంతమంది పడుతున్నారే తప్ప పొదుపు ఊసేలేదు. నిత్యావసర వస్తువుల ధరలువంట సలసల కాగుతున్నాయి. ఏ కుటుంబాన్ని కదిపినా అప్పుల చిట్టానే కనబడుతున్నది. పెరిగిన ధరలతో గ్యాస్ బండ మోయలేకపోతున్నారు. ఆదివారం చికెన్‌కు స్వస్తి పలికారు. బియ్యం ధరలు దిగిరాలేదు. పెట్రోలు, డీజిల్ భగ్గుమంటున్నాయి...



(గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో )
ఒకప్పుడు ధరలు నియంత్రణలో ఉండేవి. పప్పుల నుంచి నూనెల ధరల వరకు అంతా కట్టడి చేసేవారు. మూడేళ్ళుగా పరిస్థితి తల్లకిందులైంది. వ్యాపా రులది ఇష్టారాజ్యంగా మారింది. నిలకడలేని ధరలు తారస్థాయికి పెరిగినా సర్కారుకు పట్టడం లేదు. చిన్నాచితక కుటుంబాలు ఇప్పటికే చితికిపోయాయి. పెరిగిన ధరలతో ఇంటిని సాకలేక యజమానులు అప్పులపాలయ్యారు. సాధారణంగా నిత్యావసర వస్తువులు పెరుగుతున్నా యంటే ఇంతకుముందు ప్రభుత్వం అప్రమత్తమయ్యేది. తక్షణం అధికార యంత్రాంగం రంగంలోకి దిగేది. అక్రమం గా నిల్వచేసిన సరుకులను వెలికితీసి వ్యాపా రులపై కేసులు నమోదు చేసేవారు. క్షణాల్లో ధరలు దిగివచ్చేవి. కాని ఆ పరిస్థితి మచ్చు కైనా కనబడడం లేదు. వంట నూనె ధరలు కిలో ఒక్కింటికి 90 నుంచి 160రోజుల్లోనే 80 రూపాయలు పెరిగింది. ఉక్రెయిన్ యుద్ధం ఆరంభమైనప్పటి నుంచే నూనె ధరలకు కళ్ళెం వేయలేకపోయారు. ఇప్పుడది కిలోకు 220 రూపాయల కుపైగా చేరుకున్నాయి. ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉండడంతో సాధారణ, మధ్య తరగతి కుటుంబాలు బెంబే లెత్తిపోతున్నాయి. వంట నూనెలకే కిలోకి సరాసరిన వంద రూపాయలు చొప్పున అదన పు భారమైంది. వేరుశెనగ, సన్‌ఫ్లవర్, రైస్‌రిచ్ తరహా వంటనూనె ధరలతో అమాంతం హోటళ్ళల్లో తిను బండారాలు భారీగా పెంచేశారు. ఇంతకుముందు మినపట్టు, గారెతో సహ నూనెతో తయారయ్యే టిఫిన్‌లు అన్నీ గరిష్టంగా 25 నుంచి 30 రూపాయలు ఉండగా, ఇప్పుడా ధర 40 నుంచి 45 రూపాయలకు పెరిగింది. మిగతా 2లో..

# ప్రజల్లో క్రీడా సంస్కృతిని పెంచే ఆడుదాం ఆంధ్ర

క్రీడల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఆడుదాం

ఉత్సాహంగా ప్రారంభమైన జిల్లాస్థాయి పోటీలు

ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జనవరి, మేజర్‌న్యూస్ ప్రజల్లో క్రీడా సంస్కృతి ద్వారా ఆరోగ్యకర జీవనశైలిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను పండగ వాతావరణంలో నిర్వహి స్తోందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీలను కలెక్టర్ ఎస్.డిల్లీరావు.. జాయింట్ కలెక్టర్, ఆడుదాం ఆంధ్రా జిల్లా నోడల్ అధికారి డా. పి.సంపత్ కుమార్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో) ఎస్‌ఏ అజీజ్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీధర్ రెడ్డి, కార్పొరేటర్ అనిత, జిల్లా స్పోర్ట్స్ అంబాసిడర్లు అబ్దుల్ రజాక్ (ఫుట్‌బాల్), భావన (సాఫ్ట్ టెన్నిస్) తదితరులతో కలిసి బుధవారం ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ప్రారంభించారు. మిగతా 2లో..





## గుంటూరు లలిత హాస్పిటల్‌లో
# ఐటీ సోదాలు

ఉలిక్కిపడ్డ ప్రైవేట్ వైద్యశాల యాజమాన్యాలు

లెక్కకు మించి నోట్ల కట్టలు

గుంటూరు వైద్యం మేజర్‌న్యూస్
గుంటూరు కొత్తపేటలో లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌లో బుధవారం పెద్దఎత్తున ఐటీ సోదా లు నిర్వహించారు. ముందస్తు, రహస్య సమాచారం మేరకు ఢిల్లీ నుంచి వచ్చిన సెంట్రల్ సిబ్బంది ఈ సోదాలు నిర్వహించింది, ఈ తనిఖీల్లో లెక్కలేనన్ని కరెన్సీ నోట్ల కట్టలు బయటపడుతున్నట్లు తెలి సింది. సోదా చేస్తున్న అధికారులు ఈ వ్యవహారాన్ని అత్యంత గోప్యం గా ఉంచుతున్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన సుమారు30మంది సిబ్బంది తో అధికారులు సోదాలు చేస్తు న్నారు. మొత్తం నాలుగు బ్రాంచ్ ల్లో తనిఖీలు జరుగుతున్నాయి. పక్కా ప్రణాళిక ప్రకారం ఈ దాడులు జరిగినట్లు ఆసుపత్రిలో అన్ని విభా గాలను స్వాధీనం చేసుకొని పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం పరిశీలిస్తున్నారు. పెద్దఎత్తున సోదాలు మిగతా 2లో..



## వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీలో చేరిన చుక్కా విల్సన్‌బాబు

గుంటూరు మేజర్‌న్యూస్: మాజీ ఐఆర్ ఎస్ అధికారి చుక్కా విల్సన్ బాబు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సమ క్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో విల్సన్ బాబుకు పార్టీ కండువా కప్పి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విల్సన్ బాబు కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రిని పుష్పగుచ్ఛంతో సత్కరించారు. జీఎస్టీ అసిస్టెంట్ కమీ షనర్‌గా విధినిర్వహణలో అందరి మన్ననలు పొందిన విల్సన్‌బాబు స్వస్థలం గుంటూరుజిల్లా మిగతా 2లో..

## గుంటూరు లలిత హాస్పిటల్‌లో ఐటీ సోదాలు

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్నందున బయట వ్యక్తులను హాస్పటల్ లోనికి అనుమతించడం లేదు. హాస్పటల్ లో రోగులను కూడా వెళ్ళవద్దని దీనివల్ల హాస్పటల్లో చికిత్స ఎలా ఉన్న కొంతమంది రోగులకు బుధవారం వైద్యం అందక ఇబ్బందులు పడ్డట్టు తెలిసింది. ప్రత్యేక పరిస్థితుల్లోనే ఎమర్జెన్సీ రోగులకు కూడా పర్మిషన్ ఉంటే నే లోపలికి వచ్చేందుకు ఐటీ కోరు అధికారులు. ఆదేశాలు జారీ చేశారు, లలిత హాస్పిటల్ ఈ మధ్యకాలంలో పేరు మార్చి వ్యాపారం కొనసాగిస్తున్నారు ఆటోనగర్ దగ్గర పెద్ద ఎత్తున నూతనంగా చేపట్టిన హాస్పిటల్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఈ క్రమంలో ఐటీ దాడులు జరగటం పై పలు రకాలుగా చర్చించుకుంటున్నారు ఈ దాడుల వార్త నగరంలో దావానలంలా వ్యాపించింది. దీంతో ఓల్డ్ క్లబ్ రోడ్ లోని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యాలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాయి, కొంతమంది ఓపీలు అక్కడికక్కడే నిలిపివేసి అండర్ గ్రౌండ్ కి వెళ్ళినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సమాచారం ఏది ఏమైనప్పటికీ లలిత హాస్పటల్ ఐటీ దాడులు పై ఐటి అధికారులు రాత్రి పొద్దుపోయే వరకు రికార్డులు పరిశీలిస్తున్నారు. గురువారం కూడా ఈ సోదాలు జరిగే అవకాశం ఉంది. ఈ దాడులు రెండు రోజులు పాటు కొనసాగుతాయని తెలుస్తోంది. ఇప్పటికే ఐటీ అధికారులు, సిబ్బంది, లలిత హాస్పటల్ ఆధ్వర్యంలో ఉన్న అన్ని బ్రాంచీలను తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. సిబ్బంది నిర్వహిస్తున్న తనిఖీలను ఐటీ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా లలిత హాస్పిటలయాజమాన్యం ఈ దాడులపై ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన విడుదల చేయకపోవడం పలు అనుమానాలకి దారి తీస్తోంది. ఢిల్లీ ఐటి అధికారులు కు ఉన్న సమాచారం మేరకు గుంటూరులో ఉన్న మరికొన్ని పెద్ద హాస్పిటల్లో తనిఖీలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇటీవల కాలంలో గుంటూరులో ఉన్న పలు హాస్పిటల్ పై పెద్ద ఎత్తున ఐటి అధికారులకు కుప్పలు తెప్పలుగా ఫిర్యాదు వెళ్లినట్లు తెలుస్తోంది.

## నాలుగు రాష్ట్రాల్లోని 62 కొత్త మార్కెట్లలో ఐకియా డోర్‌స్టెప్ డెలివరీ సేవలు




గుంటూరు, మేజర్‌న్యూస్: ప్రపంచ వ్యాప్తంగా ప్రాచు ర్యం పొందిన స్వీడిష్ ఓమ్నిచానెల్ గృహోప కరణాల రిటైలర్ ఐకియా, తమ ఈ-కామర్స్ డెలివరీ లను మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 62జిల్లాల్లో వేల సంఖ్యలో పిన్ కోడ్‌లకు ప్రారంభించినట్లు వెల్లడించింది. ఐకియా స్టోర్‌ల వద్ద షాపింగ్ చేయడానికి సమీపంలోని నగరాలు, పట్టణాల నుండి వస్తోన్న వేలాది మంది కస్టమర్‌ల ఉత్సాహం, డిమాండ్, సందర్శనలను చూస్తూనే ఉన్నందున ఈ సేవల విస్తరణ జరిగింది. కస్టమర్‌లు ఐకియా యాప్‌ని ఉపయోగించి తమకు ఇష్టమైన ఉత్పత్తులను కొనుగోలు చేయవచ్చు.

## ఐదేళ్లలో ఐదు రెట్ల పరిశ్రమ వృద్ధిని నమోదు చేసిన జె.ఎస్.డబ్ల్యు పెయింట్స్



విజయవాడ, మేజర్‌న్యూస్: ప్రముఖ పర్యావరణ అనుకూల పెయింట్స్ కంపెనీ జె.ఎస్.డబ్ల్యు పెయింట్స్, ఐదేళ్ల క్రితం కార్యకలాపాలు ప్రారంభించినప్పటి నుండి వ్యాపారంలో పరిశ్రమ వృద్ధి కంటే ఐదు రెట్లు అధిక వృద్ధిని నమోదు చేసింది. ఆర్థిక సంవత్సరం 2022లో రూ. 1,000 కోట్లు దాటిన తర్వాత, జె.ఎస్.డబ్ల్యు పెయింట్స్ ఇప్పుడు 15నెలల్లో రూ. 2,000 కోట్లు రన్-రేట్‌ను తాకింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 9నెలల్లోపే రూ.1,500 కోట్ల మార్కును అధిగమించి, మరింత తక్కువ వ్యవధిలో తన తదుపరి రూ.1,000కోట్ల ఆదాయాన్ని సాధించగలమన్న విశ్వాసంతో కంపెనీ ఉంది.

## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన చుక్కా విల్సన్ బాబు

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పెదనందిపాడు మండలం పాలపర్రు గ్రామం. దివంగత మహానేత వైఎస్సార్‌కు అభిమానిగా, సీఎం జగన్మోహన్ రెడ్డి ఫాలోవర్ గా విల్సన్ కు మంచి గుర్తింపు వుంది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా ప్రత్తిపాడుకు స్థానికుడైన విల్సన్ బాబుకు అధిష్టానం సీటు కేటాయిస్తే గెలుపు ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రత్తిపాడులో టీడీపీ ఐఏఎస్ అభ్యర్థికి వైసీపీ ఐఆర్ఎస్ అభ్యర్థిగా ఇద్దరి మధ్య గట్టి పోటీ నెలకొనే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. విల్సన్‌బాబు ఎస్సి మాల సామాజిక వర్గానికి చెందిన వారు. గతంలో ప్రత్తిపాడులో అనేక పర్యాయాలు గెలుపొందిన మేకతోటి సుచరిత కూడా ఎస్సి మాల వర్గానికి చెందిన వారు కావడంతో సెంటిమెంట్ కూడా పనిచేస్తుందని చెబుతున్నారు. విల్సన్ బాబు గుంటూరు రూరల్ మండలంలోని కాపు సామాజిక వర్గానికి చెందిన మీనా కుమారిని కులాంతర వివాహం చేసుకున్నారు.

# దళారుల రాజ్యంలో బ్రతుకులు ఛిద్రం

(మొదటి పేజీ తరువాయి)

చికెన్, మటన్ ధరలు 260, 350 రూపాయలు చొప్పున పెరిగాయి. ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఈ ప్రాంతానికి భారీగా కంది, పెసర, మినపప్పులు భారీగా దిగుమతి అయ్యేవి. కాని అక్కడ సాగు తగ్గుముఖం పట్టిందనే వంకతో ఏకంగా కందిపప్పు ఏడాది క్రితం రూ.70 లోపే ఉండేది.

ఇప్పుడది రూ.30కి పైగా పెరిగి 100 కు చేరింది. మొదటి, రెండో రకం గ్రేడులుగా మార్చి పప్పు ధరల్లో వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ధర పెరిగిందేమిటని నిలదీస్తే రెండో రకం పప్పు కాస్త ధర తగ్గించి అంటగడుతున్నారు. పెసర పప్పుదీ ఇదే తీరు. వేరుశెనగ గుళ్ళు రూ.110 నుంచి రూ.120 రూపాయలకు పెరిగింది.మార్కెట్‌లో పప్పు, ఉప్పేకాదు మిగతా ధరలు దూసుకుపోతూనే ఉన్నాయి. చికెన్ చిక్కకుండా పోయింది. ఒకప్పుడు కేవలం 90 నుంచి 110 రూపాయలే ఉండగా, ఇప్పుడది 270 రూపాయలు వద్ద ప్రస్తుతానికి నిలకడగా ఉంది. గడిచిన ఏడాదిగా చికెన్ ధరలు క్రమేపీ పెరుగుతున్నాయి పెరుగుతున్న వినియోగం ఒక ఎత్తయితే కూరగాయలు, ఇతర ధరలు మండిపోతున్నాయి. గుడ్డు ధరలు ఎగు దు దిగుడుగా ఉన్నప్పటికీ సరాసరిన 4 నుంచి 5 రూపాయల ధర పలుకుతుంది. చేపలు, రొయ్యల సంగతి చెప్పనక్కర్లేదు. మార్కెట్‌లో తెల్ల చేపల ధరలు కిలో ఒక్కింటికి రూ.180 నుంచిరూ. 200 ధర పలుకుతుండగా, అదే రొయ్యలైతే ఏకంగా 350 రూపాయలకు చేరాయి. మార్కెట్‌లో పొంతనలేకుండా దూసు కెళ్తున్న ధరలు సామాన్యులను బిక్కముఖం వేసుకునేలా చేస్తున్నాయి. వీటికి తోడు నాణ్యత కలిగిన బియ్యం 25 కిలోల బస్తా వెయ్యి నుంచి 1250 చొప్పున ధర పలుకుతున్నాయి. కూరగాయల ధరలదీ ఇదే పరిస్థితి. ఒక్క ఉల్లి ధర దిగిరాగా కొత్తిమీర కట్ట రూ.35 ములక్కాడలు రెండు రూ.20, టమోటా రూ.60చొప్పున మంట మండిస్తున్నాయి. వీటికి అదనంగా పెట్రోలు ధర రికార్డు స్థాయి కి చేరింది. లీటరు ఒక్కింటికి 123 రూపాయలకు చేరింది. గ్యాస్ బండ వరుసగా పెరిగిన ధరలతో 1130కు చేరి వినియోగదారుల ఇంట గుదిబండగా మారింది.



పొదుపు మాటే లేదుమారిన ధరల పట్టికలతో సాధారణ, మధ్య తరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్ బోల్తా కొట్టింది.

ఒకప్పుడు రోజువారి దిన సరి కూలీతో కాలం గడుపుకొచ్చే వారు కూడా అంతో ఇంతో ఆరోగ్యానికి, ఇతరత్ర ఖర్చులకు కాస్త కూడబెట్టే వారు. మధ్యతరగతి కుటుంబాలైతే నెలవారీ చిట్టీలు, పిల్లల పేరిట నెలవారీ పోస్టల్, బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారు. కాని ఇప్పుడు పరిస్థితే మారింది. పొదుపు మాత్రం పరారైంది. ఆ స్థానంలో ధరల మంత్రం ముం దుకొచ్చింది. నెలవారీ బడ్జెట్ ఒకప్పుడు సాధారణ కుటుంబాల్లో 16 వేల నుంచి 21 వేలలోపు సరాసరిన ఉండేవి. కూరగాయలు, పాలు, కిరాణా ఖర్చులతో కలిసి మూడొంతులు ఖర్చయ్యేవి. వీటికి తోడు ఇప్పుడు ఇంటి అద్దెలు తడిసి మోపెడయ్యాయి. పట్టణ, పల్లె ప్రాంతాల్లో ఆస్తి పన్నులు పెంచేయడంతో పట్టణ ప్రాంతాల్లో అయితే డబల్ బెడ్‌రూం 4,500 నుంచి 7,500 రూపాయలకు అద్దె పెంచేశారు. సాధారణ ఇంటికి కరెంటు చార్జీలు 650 నుంచి గరిష్టంగా 900లోపే వచ్చేది. ఇప్పుడది కాస్తా 1800లకు పెరిగింది. ఎడాపెడా ధరలు పెంచే స్తూ పోతుండడంతో మధ్యతరగతి కుటుంబాలు విల విలలాడుతున్నాయి. క్లిష్ట పరిస్థితిని సరిదిద్దాల్సిన ప్రభుత్వం సంక్షేమం పేరిట వేల కోట్లు ఖర్చు చేస్తుందే తప్ప, ధరలను నియంత్రించడం లేదు.

# ప్రజల్లో క్రీడా సంస్కృతిని పెంచే ఆడుదాం ఆంధ్ర

(మొదటి పేజీ తరువాయి)


కలెక్టర్ ఎస్.డిల్లీరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ పతాకాన్ని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, ఆడుదాం ఆంధ్రా పతాకాన్ని ముఖ్య అతిథులతో కలిసి మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆవిష్కరించారు. క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి ముఖ్య అతిథులకు గౌరవ వందనం సమర్పించారు. క్రీడా స్ఫూర్తి ప్రతిజ్ఞ చేసిన తర్వాత కలెక్టర్ డిల్లీరావు జిల్లాస్థాయి పోటీలు ప్రారంభమవుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ప్రజల్లో క్రీడా సంస్కృతిని పెంపొందించి ఆరోగ్యకర సమాజ నిర్మాణంతో పాటు మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు గౌరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు చేసిన ఓ మంచి ఆలోచనకు కార్యరూపం ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలు అని పేర్కొన్నారు. ఈ పోటీలు గత డిసెంబర్ 26న జిల్లాలో 605 గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రారంభమయ్యాయని ఆపై మండల, నియోజకవర్గ స్థాయి పోటీలు విజయవంతంగా ముగిశాయని.. బుధవారం జిల్లాస్థాయి పోటీలు ప్రారంభమయ్యాయని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో విజేతలు అయిన జట్లు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటున్నాయని.. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ కేటగిరీల్లో ఈ పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయన్నారు. జిల్లాస్థాయి విజేతలు ఫిబ్రవరి 6 నుంచి విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మన జిల్లా జట్లు అత్యుత్తమ ప్రదర్శనతో విజయం సాధించాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విభాగాల్లో రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలిచిన జట్లకు రూ.5లక్షలు, ద్వితీయ స్థానానికి రూ.3లక్షలు, తృతీయ స్థానానికి రూ.2లక్షల నగదు బహుమతి ఉంటుందన్నారు. అదే విధంగా రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ విభాగంలో మొదటి స్థానానికి రూ. 2 లక్షలు, ద్వితీయ స్థానానికి రూ. లక్ష, తృతీయ స్థానానికి రూ.50వేలు బహుమతి ఉంటుందని వివరించారు. జిల్లాస్థాయి పోటీల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని.. క్రీడాకారులకు రవాణా, భోజన, వసతి తదితర సదుపాయాలు కల్పించినట్లు కలెక్టర్ డిల్లీరావు తెలిపారు. జాయింట్ కలెక్టర్, ఆడుదాం ఆంధ్రా జిల్లా నోడల్ అధికారి డా. పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ ఫిట్‌నెస్‌ను పెంపొందించేందుకు క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో విజేతలకు నగదు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు.

జిల్లాస్థాయిలో 69 మ్యాచ్‌లు జరగనున్నాయని ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం ఆనందించదగ్గ విషయమని.. క్రీడా స్ఫూర్తితో వ్యవహరించి పోటీలను విజయవంతం చేయాలన్నారు. జిల్లాస్థాయిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విభాగాల్లో విజేతలకు మొదటి బహుమతి రూ. 60 వేలు, ద్వితీయ బహుమతి రూ. 30 వేలు, తృతీయ బహుమతి రూ. 10 వేలు ఉంటుందని.. బ్యాడ్మింటన్‌లో వరుసగా రూ. 35 వేలు, రూ. 20 వేలు, రూ. 10 వేలు బహుమతి ఉంటుందని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ వివరించారు.

విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ క్రీడల ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు, ప్రతిభను గుర్తించి మట్టిలో మాణిక్యాలను వెలికితీసి, ప్రోత్సహించే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి ఆడుదాం ఆంధ్రా క్రీడా పండగను ప్రారంభించారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా నగదు, ఇతర బహుమతుల కోసం రూ. 12 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. క్రీడాకారులను గుర్తించి, ప్రోత్సహించేందుకు ఖర్చుకు వెనకాడకుండా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగావకాశాలు కూడా దక్కించుకోవచ్చని.. అందువల్ల క్రీడాకారులు ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని మేయర్ భాగ్యలక్ష్మి సూచించారు. కలెక్టర్ ఎస్.డిల్లీరావు.. అతిథులతో కలిసి క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభించారు. విజయవాడ తూర్పు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గాల జట్ల క్రికెట్ మ్యాచ్‌కు టాస్ వేశారు. కార్యక్రమంలో కోచ్‌లు, ఏడు నియోజకవర్గాల క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్డీ 990 ఈవీవోను ఆవిష్కరించిన శామ్సంగ్

విజయవాడ, మేజర్‌న్యూస్: దేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్సంగ్, కంపెనీ యొక్క సాలిడ్ స్టేట్ డ్రైవ్‌ల శ్రేణికి సరికొత్త జోడిం పుగా సరికొత్త ఎస్ఎస్డీ 990 ఈవీవోను పరిచయం చేసింది. మెరుగైన శక్తి సామర్థ్యంతో, ఎస్ఎస్డీ 990 ఈవీవో గేమింగ్, పని, వీడియో ఎడిటింగ్, ఫోటో ఎడిటింగ్ వంటి రోజువారీ కంప్యూటింగ్ అనుభవాలను మెరుగుపరచ దానికి రూపొందించబడిన శక్తివంతమైన పనితీరును అందిస్తుంది. సెకనుకు 5,000 ఎంబీ వరకు, సెకనుకు 4,200 ఎంబీ వరకు సీక్వెన్షియల్ రీడ్, రైట్ వేగంతో అమర్చబడి వినియోగదారులకు ఆదర్శవంతమైన పరిష్కారంగా దీనిని భావిస్తున్నారు.



# పెండ్యాల లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



కంచికచర్ల మేజర్ న్యూస్ : మండలంలోని పెండ్యాల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్ రావు బుధవారం ఉదయం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల అభ్యున్నతి కోసం నేటి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. పఠాన్, సయ్యద్, షేక్, మహమ్మద్ లకు సంక్షేమ పథకాలదించి ముఖ్యమంత్రి అందరికీ బాసటగా నిలిచారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనార్టీలకు మొండి చేయి చూపించారని ఎద్దేవ చేశారు ఈ రోజు ఏకంగా ఉప ముఖ్యమంత్రి పదవిలో ఒక మైనారిటీ సోదరుడు ఉన్నారని తెలిపారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు మైనారిటీలను ఎమ్మెల్యేలుగా గెలిచారని, జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో నలుగురిని ఎమ్మెల్సీలుగా నియమించారని గుర్తు చేశారు. అప్పటికి, ఇప్పటికి ఎంత తేడా ఉందో గమనించాలని కోరారు. 2019 నుంచి మైనార్టీలకు సువర్ణ అధ్యాయమని రాష్ట్రంలో ఇమామ్‌లు, మౌజమ్‌లకు ఇచ్చే గౌరవ భృతిని గత ప్రభుత్వం పక్కనపెడితే జగన్ ప్రభుత్వం ఆ బకాయిలు చెల్లించడమే కాకుండా పెంచిన గౌరవ భృతిని చెల్లిస్తోందని చెప్పారు. ఇది మైనారిటీ వర్గాలకు రాజకీయ సాధికారత కల్పించిన ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ,తదితరులు పాల్గొన్నారు.

# టిడిపిలో చేరిన అన్నవరపు వెంకటేశ్వరరావు



నందిగామ, మేజర్ న్యూస్ : పట్టణంలోని కాకాని నగర్ మాజీ శాసనసభ్యురాలు శ్రీమతి తంగిరాల సౌమ్య కార్యాలయం నందు బుధవారం నాడు వైఎస్సార్ పార్టీ నేత అన్నవరపు వెంకటేశ్వరరావు వారి సతీమణి మాజీ వార్డు మెంబర్ పద్మావతి వారి కుటుంబ సభ్యులు ఆ పార్టీని విడి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ పట్టణ తెదేపా కౌన్సిలర్లు,తెదేపా నేతలతో కలిసి వారిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య ఆహ్వానించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ అన్నవరపు వెంకటేశ్వరరావు వారి సతీమణి మాజీ వార్డు మెంబర్ పద్మావతి కుటుంబ సభ్యులు నిబద్ధత కలిగిన కుటుంబం అన్నారు. వైసీపీ పార్టీ విధివిధానాలు, ప్రజా వ్యతిరేక విధానాలను సహించలేక ఆ పార్టీని వీడి ఈరోజు తెలుగుదేశం పార్టీలోకి విచ్చేసిన సందర్భంగా వారిని తెలుగుదేశం పార్టీలోకి మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాము. వైసీపి ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాల ప్రజలు కుదేలైపోయారు. నియంత ముఖ్యమంత్రి జగన్ సిద్ధం అంటుంటే రాష్ట్ర ప్రజానీకం ఆయనను దింపడానికి మేము కూడా సంసిద్ధం అంటున్నారురానున్న ఎన్నికల లో వైసీపీ పార్టీని రాష్ట్ర ప్రజానీకం బంగాళాఖాతంలో కలపడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిసి లు అంటే బ్యాక్ వర్డ్ కాస్ట్ కాదు, బ్యాక్ బోన్ క్యాస్ట్ - యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం (ఉంగుటూరు), మేజర్ న్యూస్ : ఉంగుటూరు మండల పార్టీ ఆధ్వర్యంలో జయ హెూ బి.సి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ బిసి లు అంటే బ్యాక్ వర్డ్ కాస్ట్ కాదు, బ్యాక్ బొన్ క్యాస్ట్ అని అన్నారు. బిసిలకు పెద్ద పీట వేసింది తెలుగుదేశం పార్టీ హయం లోనే జరిగింది అని, గత ప్రభుత్వం లో బిసి లకు ఆదరణ పథకాలు తీసుకు వచ్చి వారిని అర్దిక%శీ%గా నిలబెట్టడంలో చంద్రబాబు కి మాత్రమే ఈ ఘనత అని అన్నారు. రాబోయే రోజుల్లో టీడీపీ అధికారం లోకి రాగానే బి.సీ లకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని కల్పిస్తుంది అని అన్నారు. రాష్ట్ర కార్య కార్యదర్శిలు బచ్చుల బోస్, దొంతు చిన్నా, జన సేన గన్నవరం నియోజకవర్గ ఇంఛార్జి చలమలశెట్టి రమేష్ బాబు, రాష్ట్ర బి.సి సెల్ ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి, బత్తిన దాసు,వేణు,పలువురు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక బిసి లపై అనేక దాడులు, హత్యలు, అక్రమ కేసులు పెట్టి బిసి లకు ఆన్యాయం చేసింది. బిసిలతోనే అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బిసి లకు కనీసం ఒక్క కార్పొరేషన్ కూడా ఇవ్వలేని దుస్థితి ఈ వైసీపీ పార్టీది అని అన్నారు. రాబోయే రోజుల్లో టీడీపీ పార్టీనీ గెలిపించుకునే దిశగా బిసిలు అందరూ కూడా నడుం బిగించుకొని పార్టీ అధికారంలోకి రావడం లోనే పాటు పడలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అరుమళ్ల వెంకట కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆళ్ళ హనుక్, బి.సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మొదుగుమూడి సత్యనారయణ, రాష్ట్ర నాయకులు కొండేటి కొండలు, ఉంగుటూరు మండల బి.సి సెల్ అధ్యక్షులు సామిరెడ్డి రాము, రాష్ట్ర సగర కార్యదర్శి నక్క వెంకటేశ్వరావు, దండు సుబ్రమణ్య రాజు, వేమిరెడ్డి శ్రీనివాసరావు, ఉయ్యూరు మురళి, సుబన్ అలి, పలువురి ఉంగుటూరు మండల పార్టీ గ్రామాల బి.సి నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీకి చెల్లించవలసిన బకాయిలు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడండి



పెడన, మేజర్ న్యూస్ : పట్టణ ప్రజలు పురపాలక సంఘ కార్యాలయానికి చెల్లించవలసిన నీటి పన్నులు, ఇంటి పన్నులు, వ్యాపార పన్నులు, వెంటనే చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగకుమారి పట్టణ ప్రజలను కోరారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సమావేశంలో ఏజెండాలోని 10 అంశాలను ప్రవేశపెట్టగా కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. సమావేశంలో జనసేన కౌన్సిల్ సభ్యురాలు మూడవ అంశంపై అభ్యంతరం తెలిపి అధిక మొత్తంలో ఆశీలు వసూలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో సీనియర్ కౌన్సిల్ సభ్యుడు కటకం ప్రసాదు మాట్లాడుతూ అందువల్లే గేజిట్లో ఎంత ఆశలు వసూలు చేయాలనేది ప్రవేశపెట్టామని గౌరవ జనసేన కౌన్సిల్ సభ్యురాలు గుర్తించాలని బదులిచ్చారు. అనంతరం తొమ్మిదవ వార్డు కౌన్సిల్ సభ్యులు గరిక ముక్కు చంద్రబాబు మాట్లాడుతూ రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఇంజనీ రింగ్ విభాగం వారు రక్షిత తాగునీ రును నిల్వ ఉంచి ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చైర్పర్సన్ను కోరారు. అంతేగాక పట్టణంలో విచ్చలవిడిగా ఎటువంటి పరిమిషన్లు లేకుండా ఆర్వో ప్లాంట్లు నిర్వహిస్తున్నారని వాటి వల్ల ప్రజలు కిళ్ళ వ్యాధులతో బాధపడుతు న్నారని దానిపై ఇంజనీరింగ్ భాగం వాళ్లు ఎందుకు దృష్టి సారించడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఈ సమావేశంలో పురపాలక సంఘ కార్యాలయం సిబ్బంది ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది తదితరులు ఉన్నారు.

# స్పందనలో రఘు వల్లంకొండ జన్మదినోత్సవం




గన్నవరం, మేజర్ న్యూస్ : కృష్ణా జిల్లా గన్నవరం మండలం దావాజిగూడెం లో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో స్పందన మానసిక వికాస కేంద్రం లో బుధవారం ఐర్లాండ్ లో ఉంటున్న ప్రవాస భారతీయుడు రఘు వల్లంకొండ జన్మదినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా విచ్చేసిన వీనస్ బుక్ సెంటర్ అధినేత మోటమార్రి శేఖర్ మాట్లాడుతూ ప్రవాస భారతీయుడు ఐర్లాండ్ దేశంలో ఉంటున్న రఘు వల్లంకొండ స్పందన మానసిక వికాస కేంద్రం దివ్యాంగుల మధ్యలో జరపడం ఎంతోమంది కి ఆదర్శమని ఆయన అన్నారు. రఘు విదేశాలలో ఉన్నప్పటికీ సొంత గడ్డపై ఉన్న మమకారంతో సేవాకార్యక్రమాల్లో భాగంగా స్పందన ఒక మంచి కార్యక్రమం చెయ్యడం ఎంతో అభినందనీయమని, మనమంతా స్పందన నకు అండగా తోడ్పాటు అందించవలసి అవసరం ఉందని శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్, కృష్ణా జిల్లా దివ్యాంగుల హక్కుల పరిరక్షణ అడ్వైజరీ కమిటీ బోర్డు మెంబర్ సంకాబత్తుల వెంకట్ మాట్లాడుతూ రఘు వల్లంకొండ ఐర్లాండ్‌లో ఉన్నప్పటికీ తమకు జన్మనిచ్చిన దేశాన్ని మరవకుండా సేవలు చెయ్యడం ఆయన విశాలమైన హృదయానికి నిదర్శనమని వెంకట్ అన్నారు. స్పందన లో దివ్యాంగులకు ఉచితంగా విద్యా వైద్య రవాణా భొజన సౌకర్యాలు అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు మరిన్ని సేవాకార్యక్రమాలు చెయ్యటానికి హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ కి రఘు లాంటి వారు ముందుకు వచ్చి తోడ్పాటు అందించినట్లు అయితే మరిన్ని సేవలు చెయ్యగలమని వెంకట్ ఆకాంక్షించారు. స్పందన పాఠశాల కు ఎలక్ట్రికల్ వర్క్ అంతా మోటమర్రి శేఖర్ చేయించడం జరిగిందని వెంకట్ గుర్తు చేసారు. అనంతరం స్పందన బాలలకు మంచి విందు, స్వీట్లు,పండ్లు పుస్తకాలు బాక్సులను పంపిణీ చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా రఘు వల్లంకొండ, మారుతి ఎలక్ట్రికల్ అధినేత రాంబాబు ( నాని)వీనస్ బుక్ సెంటర్ అధినేత మోటమర్రి శేఖర్ కి స్పందన మానసిక వికాస కేంద్రం ప్రిన్సిపాల్ సంకాబత్తుల రజిత వెంకట్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో బావిశెట్టి ప్రదీప్, నాని స్పందన సిబ్బంది పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు పట్ల అవగాహన



కంచికచర్ల మేజర్ న్యూస్ : ఆటో డ్రైవర్లు క్రమశిక్షణతో మెలగాలని ఎక్కడబడితే అక్కడ ఆటోలు నిలిపి ట్రాఫిక్ కి అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని నందిగామ రూరల్ సిఐ పి చంద్రశేఖర్ రావు సున్నితంగా హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో ఆటో డ్రైవర్లకు బుధవారం సీఐ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్ రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆటోలు ఎక్కడపడితే అక్కడ నిలిపి ట్రాఫిక్ కి అంతరాయం కలిగించకుండా ఆటోస్టాండు ల వద్ద మాత్రమే నిలుపుకోవాలని సూచించారు. వాహన అనుమతి పత్రాలు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఆటోల్లో ఉండాలని తెలిపారు. టేప్ రికార్డు, సౌండ్ బాక్సు ల వల్ల ఎక్కువ నష్టాలు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. అధికంగా ప్రయాణికులు ఎక్కుట వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. అతి వేగంగా ఆటోలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని కోరారు. జాతీయ రహదారిపై అడ్డదిడ్డంగా యూటర్న్ తీసుకోరాదన్నారు ట్రాఫిక్ నియమాలు పాటించని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల ఎస్సై 2 హైమావతి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా నాయకులు



చల్లపల్లి మేజర్ న్యూస్ : అధికారులు కంచే చేను మేసిన చందంగా ఉన్న నేటి పరిస్థితుల్లో భూ హక్కు చట్టం ద్వారా నిర్ణయాత్మక అధికారాలు తహసీల్దార్ల చేతుల్లో ఉంచటం అత్యంత ప్రమాదకరమనీ.. భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యపరచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో భూ హక్కు చట్టం వల్ల కలిగే నష్టాలు, అనుసరించాల్సిన పోరాట పంథాపై బుధవారం ఉదయం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, భూ హక్కు చట్టంపై ప్రభుత్వమే వెనుకడుగు వేసేలా ఐక్యంగా కలిసి పోరాడదామన్నారు. రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులే చట్టాలను ఉల్లంఘిస్తున్న పరిస్థితులు ఉన్నాయనీ, అవినీతికి అధికారులే ఆజ్యం పోస్తున్న పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ధరణి పోర్టల్ కారణంగా ఎన్నో సమస్యలు వచ్చాయనీ, కేసీఆర్ ఓటమికి అదో ప్రధాన కారణమన్నారు. తహసీల్దార్లు అధికారపార్టీకి కీలు బొమ్మలుగా మారారనీ, ఏ చట్టాన్నీ కాపాడే పరిస్థితిలో వారు లేరన్నారు. మట్టి, ఇసుక దందా, సీఆర్ జడ్ పరిధిలో తవ్వకాలను పట్టించుకోవటం లేదన్నారు. ఐక్య పోరాటాలతోనే ప్రతిఫలం రాబట్టగలమనీ, చట్టం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో భయం పోగొట్టి వారికి ధైర్యాన్ని ఇవ్వాలనీ, ప్రజల్ని చైతన్యం చేయటంలో ప్రముఖ పాత్ర పోషించాలని సూచించారు. నియోజకవర్గంలో భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా జరిగే ఆందోళనలకు ఈ రౌండ్ టేబుల్ సమావేశం నాంది కావాలన్నారు. ప్రముఖ న్యాయవాది, జనసేన నాయకులు మత్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, భూ హక్కు చట్టం ప్రజల ఆస్తులకు, జీవన మనుగడకు ఇబ్బందికరమన్నారు. చట్టం అమలైతే న్యాయ, రెవెన్యూ, రిజిస్ట్రీ అధికారాలన్నీ ఒకేచోట కేంద్రీకృతమవుతాయని తెలిపారు. ప్రజల మనుగడ, హక్కుల కోసం శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలను వేర్వేరుగా ఉంచుతూ రాజ్యాంగబద్ధంగా వ్యవస్థలను తీర్చిదిద్దటం జరిగిందనీ, రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకురావటం దురదృష్టకరమన్నారు. ప్రజల ఆస్తులు ప్రజలచేతుల్లో నుంచీ వెళ్లిపోయే ప్రమాదం నెలకొందనీ, చట్టం గురించి ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా కోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేయటం జరిగిందనీ, స్టే రాకుంటే భవిష్యత్ ఉద్యమాన్ని తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ..జనసేన కూటమి రాబోయే ఎన్నికల్లో ఈ చట్టాన్ని ప్రాధాన్యతాంశంగా తీసుకున్నారని వివరించారు. సీపీఐ రాష్ట్ర నాయకులు వెలగపూడి ఆజాద్ మాట్లాడుతూ, భూ హక్కు చట్టం ద్వారా ప్రజలు ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టబడ్డారని తెలిపారు. ప్రజానీకానికి చట్టంలో లోటుపాట్లు తెలియచేయాలనీ, గ్రామ స్థాయికి తీసుకువెళ్లి ప్రతిఘటించ చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మన హక్కు మన చేతుల్లో లేదనే భావన అందరూ తెలుసుకోవాలన్నారు. సీపీఎం నేత శీలం నారాయణరావు మాట్లాడు తూ, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో చేయలేని పని ఏపీ ప్రభు త్వం హుటాహుటిన చేస్తూ భూ హక్కు చట్టం చేసిందన్నారు. భూ హక్కులపై సమస్య ఏర్పడితే గ్రామీణ ప్రాంత రైతాంగం, సామాన్యులు హైకోర్టులో కేసు వేసుకోవాల్సిన పరిస్థితి ఈ చట్టం ద్వారా వచ్చిందనీ, ఇది చాలా దుర్మార్గమన్నారు. కార్పోరేట్ శక్తులకు భూమిని కట్టబెట్టేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. సీపీఐ సీనియర్ నేత మాలెంపాటి కాంచనరావు ఆధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఎల్ పార్టీనేత జన్ను జగన్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, సీపీఐ జిల్లా కార్యదర్శి అద్దాడ ప్రసాద్ బాబు, రైతుసంఘాల నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, వేమూరి రత్నగిరిరావు, గుత్తికొండ రాము, బావిరెడ్డి వెంకటేశ్వరరావు, అరజా కిరణకాంత్, చోడాబత్తిన ఆదినారాయణ, న్యాయవాదులు పులి శ్రీనివాసరావు, గొరిపర్తి శ్రీనివాసరావులు ప్రసంగించగా,వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఉప సర్పంచ్ ముమ్మనేని నాని, నేతలు నాదెళ్ల వెంకట నరసయ్య, ఉస్మాన్ షరీఫ్, అట్లూరి వెంకటేశ్వర్రావు, మేకా నరసింహారావు, మల్లుపెద్ది బోసు, షేక్ నబీ భోరి, మిక్కిలినేని మధు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలు తనిఖీ చేసిన సిఐ హనీష్



నందిగామ, మేజర్ న్యూస్: పట్టణం లోని మెయిన్ రోడ్ గాంధీ సెంటర్లో వాహనాలు పట్టణ సిఐ హనీష్, ఎస్సై పండు దొర, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ తనిఖీలు చేశారు. ద్విచక్ర వాహనాలు లైసెన్సు లేని వారిని, వాహనాన్ని అతివేగంతో నడిపే వాళ్ళని, సరైనటువంటి ఇన్సూరెన్స్, పొల్యూషన్స్ అండ్ వెహికల్ రిజిస్ట్రేషన్,లేని వాళ్ళని, నెంబర్ ప్లేట్ లేకుండా బండి నడిపే వాళ్ళని సిఐ హనీష్ కౌన్సిలింగ్ ఇచ్చారు. మరోసారి రోడ్డుపైన ద్విచక్ర వాహనాలు సరైన, రిజిస్ట్రేషన్ లేకుండా అతివేగంతో నడపకుండా, వాహనదారులకు సరైనమార్గంలో వెళ్లాలని, వాహనానికి సంబంధించిన అన్ని కాగితాలు దగ్గర ఉంచుకొని వాహనాన్ని నడపాలని సూచనలు చేశారు.

## ఎన్నికల నిర్వహణపై ఆర్డీవో అధికారులతో సమావేశం




నందిగామ, మేజర్ న్యూస్: పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం నందు నందిగామ రెవిన్యూ డివిజన్ అధికారి మరియు 83-నందిగామ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి సాయి బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.పోలింగ్ కేంద్రాల సంబంధించి పరిశీలన, ఎన్నికలకు సంబంధించిన విధివిధానాలు, మ్యాపింగ్ గురించి సమావేశంలో చర్చించారు.ఈ కార్యక్రమం నందు నందిగామ నియోజకవర్గ ఏఈఆర్వోలు,పోలీస్ డిపార్ట్మెంట్ వారు, సెక్టర్ ఆఫీసర్లు పోలీస్ సెక్టార్ ఆఫీసర్లు మరియు ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో విశ్వభారతి విద్యార్థికి చోటు




గుడివాడ, మేజర్ న్యూస్: ఇంటర్ నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో గుడివాడ విశ్వ భారతి విద్యార్థికి చోటు లభించిందని పాటశాల కరస్పాండెంట్ పొట్లూరి శ్రీమన్నారాయణ తెలిపారు. హైదరాబాద్ లోని అష్టలక్ష్మీ దేవాలయంలో కూచిపూడి కళాకారులు శివ పంచాక్షరిని ప్రదర్శించారు. అందులో తమ పాఠశాల విద్యార్థిని మాజేటి వాగ్మీశ్రీ ఇంటర్నేషనల్ వండర్ బుక్లో స్థానం సంపాదించినట్లు ఆయన తెలిపారు. పాటశాల అసెంబ్లీ సందర్భంగా విద్యార్థిని కరస్పాండెంట్తో పాటు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## సీఎం సహాయనిధి నుంచి రూ.4.75 లక్షల ఆర్థికసాయం మంజూరు



జి కొండూరు మేజర్ న్యూస్ : ఎన్టీఆర్ జిల్లామైలవరం నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థికసాయం మంజూరైంది. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆర్థికసాయాన్ని మంజూరు చేయించారు. ఈ విషయాన్ని విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.మొత్తం నలుగురు లబ్దిదారులకు రూ. 4,75,000లు మంజూరయ్యాయి. మైలవరం మండలం వెల్వడంకు చెందిన శీలం పద్మావతికి రూ. 1.40 లక్షలు, వెల్వడంకు చెందిన కొణతం జమలయ్యకు రూ. 1.40 లక్షలు, జి.కొండూరు మండలంలోని వెలగలేరుకు చెందిన అరవపల్లి వెంకటేశ్వరరావుకు రూ. 65వేలు, విజయవాడ రూరల్ మండలం జక్కంపూడికి చెందిన బోడేపూడి బసవయ్యకు రూ. 1.30 లక్షలు మంజూరయ్యాయి.

## వైసీపీ ప్రభుత్వంలో చేతివృత్తుల వారికి తీరని అన్యాయం : వెనిగండ్ల



గుడివాడ, మేజర్ న్యూస్: వైసీపీ ప్రభుత్వంలో చేతివృత్తుల మీద జీవనం చేసేవారు తీవ్రంగా నష్టపోయారని టీడీపీ ఇన్చార్జి వెనిగండ్ల రాము విమర్శించారు. పట్టణంలోని శ్రీనివాస సెంటర్లో స్వర్ణకారుల సంఘం ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వెనిగండ్ల రాముతో పాటు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, పిన్నమనేని బాబ్జీ, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పెట్టిన అడ్డగోలు నిబంధనలకుతోడు, వారికి అందజేయాల్సిన ప్రోత్సాహకాలను ఎత్తేయడంతో అనేక వృత్తులు కనుమరుగౌతున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ జనసేన సంకీర్ణ ప్రభుత్వంలో అడ్డగోలు నిబంధనలను ఎత్తేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు కోట సూరకరాజు, ప్రధాన కార్యదర్శి మందనపు మోహన బ్రహ్మాజీ, గోల్డ్ స్మిత్ నాయకులు వేముల శ్రీను, మౌళి, దుర్గాప్రసాద్, గోపి, విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చింతలూరి సత్యన్నారాయణ, రాష్ట్ర నాయకులు భవిరి శంకర్ నాథ్, జనసేన అధ్యక్షులు మజ్జి శ్రీనివాస్, టీడీపీ నాయకులు మున్వర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి ఆటోకిందే పడి 4ఏళ్ల బాలుడు మృతి

**– శోకసంద్రంలో తల్లిదండ్రులు, బంధువులు**



గుడివాడ, మేజర్ న్యూస్: తన తండ్రి ఆటో కిందపడి నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన హృదయ విధారకర ఘటన మండలంలోని మోటూరు గ్రామంలో బుదవారం చోటుచేసుకుంది. ఆటో నడుపుతూ జీవనం సాగించే పరిగంజి మురళీకృష్ణ ఇంటి వద్ద ఆటో పార్క్ చేస్తున్న క్రమంలో రివర్స్ చేస్తుండగా, ఇంటి ముందు ఆడుకుంటూ ఉన్న బాలుడు రిషిక్(4) ప్రమాదవశాత్తు ఆటో వెనక టైర్ కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. బాలుడిని హుటాహుటిన గుడివాడ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కు తరలించగా అప్పటికే రిషిక్ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాలుడి మరణ వార్త విన్న కుటుంబ సభ్యులు శోక సముద్రంలో మునిగిపోగా, మోటూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# సంక్షేమ రాజ్యం జగన్ కే సొంతం: ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ, మేజర్ న్యూస్: సంక్షేమ రాజ్యం జగన్ కే సొంతమని, నూరుశాతం హామీలను అమలుచేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపాలని ఎమ్మెల్యే కొడాలి నాని కొనియాడారు. గుడివాడ రూరల్ మండలం చౌటపల్లి గ్రామంలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.61.52 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును ఎమ్మెల్యే కొడాలి నాని బుధవారం ప్రారంభించారు. తొలుత పంపు హౌస్ రూమ్ను, సర్పంచ్ వెలగలేటి రమ్య ప్రారంభించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలతో కలిసి శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు నూరు శాతం అందేలా సీఎం జగన్ ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కుల మతాలకు అతీతంగా పేద వర్గాలందరికీ విద్యా, వైద్యం అందుబాటులోకి తేవడమే కాకుండా, అర్హతే ప్రామాణికంగా పేద ప్రజల సొంతింటి కలను నిజం చేసిన మహోన్నతుడు సీఎం జగన్ అని కొనియాడారు. అప్పుడే పుట్టిన పసిబిడ్డ నుండి పండు ముసలి వరకు ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం సీఎం జగన్ నిరంతరం ఆలోచిస్తున్నారని కొడాలి నాని అన్నారు. కరోనా సమయంలో రూపాయి ఆదాయం రాకపోయినా, ఆర్థిక ఇబ్బందులు తలెత్తిన వెనకడుగు వేయకుండా నూరు శాతం మేనిఫెస్టో హామీలను విజయవంతంగా అమలు చేసిన సీఎం జగన్ పైనున్న దేవుడుని, కింద ఉన్న ప్రజలను మాత్రమే నమ్ముకున్నారని ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. వందలాది కోట్ల రూపాయలతో గుడివాడలో జరుగుతున్న అభివృద్ధిని చూడలేని కబోదులుగా ప్రతిపక్షాలు మిగిలాయని ఆయన ఎద్దేవా చేశారు. అనంతరం ఎమ్మెల్యే కొడాలి నానిను గ్రామస్తులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గొల్ల రామకృష్ణ, ఎంపీపీ గద్దె పుష్పరాణి, వైస్ ఎంపీపీ బట్టు నాగమల్లేశ్వరి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మట్టా నాగమణి జాన్ విక్టర్, వైస్ ఎంపీపీ బట్టు మల్లేశ్వరి, కృష్ణాజిల్లా వైఎస్ఆర్సిపి యూత్ అధ్యక్షుడు మెరుగు మాల కాళీ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ మేకల సత్యనారాయణ, మండల వైసీపీ నాయకులు కారె జోసఫ్, తాసిల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో వెంకటరమణ, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, చౌటపల్లి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# విక్టరీ బాప్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవంతంగా ముగిసిన క్రీస్తు సువార్త సభలు




గుడివాడ, మేజర్ న్యూస్: గుడివాడ ఎన్టీఆర్ స్టేడి యం ప్రాంగణంలో గత మూడు రోజులుగా విక్టరీ బాప్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగు తున్న క్రీస్తు సువార్త సభలు మంగళవారం రాత్రితో విజయవం తంగా ముగిసాయి. ముగింపు సభల్లో ఎమ్మెల్యే కొడాలి నాని ముఖ్యఅతిథిగా పాల్గొని క్రైస్తవ విశ్వాసులనుద్దేశించి మాట్లాడారు. ప్రేమ, జాలి, దయ, కరుణ గుణాలకు ప్రతిరూపం క్రైస్తవ త్వమని ఎమ్మెల్యే నాని అన్నారు. నిత్యం ఏసు ప్రభువును ప్రార్థించే సీఎం జగన్ రాష్ట్రంలోని పేద వర్గాల ఉన్నతికి ఎంతో శ్రమిస్తున్నారన్నారు. ప్రభు ఆదేశించినట్లు రెండు లక్షల 50వేల కోట్ల నిధులను ప్రభుత్వ ఖజానా నుండి నేరుగా ప్రజలకు అందిం చిన వ్యక్తి సీఎం జగన్ అని ఎమ్మెల్యే నాని కొనియ ాడారు. నిత్యం ప్రజల కోసం పరితపించే సీఎం జగన్ కుటుంబానికి ఏసుప్రభు ఆశీస్సులు ఉండా లని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి మతవిశ్వాసాలకు అనుగుణంగా జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆటంకాలు లేకుండా చూడాలని సీఎం జగన్ ప్రభుత్వ యంత్రాంగానికి నేరుగా చెప్పారని ఎమ్మెల్యే కొడాలి నాని తెలియ జేశారు. ఇంత పెద్ద ఎత్తున సభలు నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులను ఎమ్మెల్యే కొడాలి నాని అభినందించారు. ప్రార్థనల నిర్వహణకు తమకు ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణాన్ని సమకూర్చడమే కాక, సభల విజయవంతానికి సహకారం అందిం చిన ఎమ్మెల్యే కొడాలి నానికు నిర్వాహ కులు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం విక్టరీ బాప్టిస్ట్ అసోసియేషన్ సభ్యులు, దైవ సేవకులు ఎమ్మెల్యే కొడాలి నానికు ఆత్మీయ సత్కారం చేశారు. తొలుత సభల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే కొడాలి నానికు క్రైస్తవ విశ్వాసులు కరచాలనాలు చేస్తూ తమ అభివాదాలు తెలియజేశారు. ముగింపు సభల్లో విక్టరీ బాప్టిస్ట్ అసోసియేషన్ కన్వీనర్ పండు మద్దాలి, సభల ఆర్గనైజర్ శ్యాంబాబు, మంద సువర్ణ బాబు, గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ మట్టా నాగమణి జాన్ విక్టర్, వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకులు వెంపటి సేమన్, క్రిస్టియన్ సెల్ జోనల్ ఇంచార్జ్ కేజే విక్టర్ పాల్, బిషప్ అప్పికట్ల జాషువా, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ పాలేటి చంటి, వల్లురుపల్లి సుధాకర్, రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన దైవ సేవకులు, వేలాదిగా క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన కాంగ్రెస్ ప్రాపకం కోసం షర్మిళ పాకులాడడం విడ్డూరం



గుడివాడ, మేజర్ న్యూస్: రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన కాంగ్రెస్ ప్రాపకం కోసం షర్మిళ పాకులాడడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే కొడాలి నాని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగన్ పై షర్మిల చేస్తున్న వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కొడాలి నాని బుధవారం ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదిమంది పనికిమాలిన వెధవల్ని వేసుకొని రాజశేఖర్ రెడ్డి బిడ్డ అంటూ తెలంగాణలో పరువు తీసుకున్న షర్మిల ఇప్పుడు ఏపీకి వచ్చి అదే పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఏం జరగాలన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని మాట్లాడుతున్న షర్మిల కనీసం ఈసారి ప్రతిపక్ష హోదా వచ్చే అవకాశం కూడా లేదన్న విషయాన్ని గ్రహించాలన్నారు. ఎంపీగా కూడా గెలుస్తాడో తెలియని రాహుల్ గాంధీ రాష్ట్ర సమస్యలు ఎలా పరిష్కరిస్తాడని ప్రశ్నించారు. జీరో పర్సెంట్ ఓట్ల శాతం ఉన్న షర్మిల పార్టీ, ఒక శాతం పర్సెంట్ ఉన్న కాంగ్రెస్ తో కలిస్తే ఏం జరుగుతుందన్నారు. రాజకీయ లబ్ధి కోసమే జగన్ పై షర్మిల నిందలు వేస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏం జరుగుతుందో కనీస అవగాహన లేని షర్మిల ఇప్పుడొచ్చి ఏదేదో మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతి పథకానికీ రాజశేఖర్ రెడ్డి పేరు పెట్టి, ఆయన అడుగుజాడల్లో నడుస్తున్న జగన్ ప్రభుత్వంపై నిందలు వేయడం దారుణమని, ప్రజలే బుద్ధిచెబుతారాన్నారు.

# మరియ నివాస్ పాఠశాలలో "యాన్యువల్ స్పోర్ట్స్ డే"




నందిగామ, మేజర్ న్యూస్: పట్టణ శివారు శిలువగరిలోని మరియ నివాస్ పాఠశాలలో నిర్వహించిన యాన్యువల్ స్పోర్ట్స్ డే వేడుకల్లో శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడా పోటీలలో విజేతలైన విద్యార్థులకు మెడల్స్ మరియు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, స్నేహభావం పెంపొందుతాయన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు ఆటలు ఆడాలని.. ఇప్పుడిప్పుడే సమాజం యోగ, క్రీడల పట్ల ఆసక్తి కనబరుస్తుండటం శుభపరిణామమని చెప్పారు. అదేవిధంగా తమ తల్లిదండ్రుల ఆశయాలను, ఆశలను నెరవేర్చేలా విద్యార్థులు ఏకాగ్రత, పట్టుదలతో చదువుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. సమాజంలో గౌరవం, ఉన్నత స్థితి లభించాలంటే కేవలం చదివే మార్గమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మరియ నివాస్ ప్రిన్సిపల్ సిస్టర్ మాధురి, సుపీరియర్ సిస్టర్ గీతా మాధ్యు, సిస్టర్ చైతన్య, మాగల్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వామి, సర్పంచ్ రవి కిరణ్ రెడ్డి, ఎంపీటీసీ వేల్పుల రాము, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ







నందిగామ, మేజర్ న్యూస్: పట్టణంలో 2వ 9వ, 17వ వార్డుల లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మరియు మాజీ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ఆదేశాల మేరకు గడపగడపకు కరపత్రాలు పంచుతూ నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే ఇవ్వనున్న మంచి పథకాల గురించి వివరించారు. రమణా కాలనీలో గత ప్రభుత్వ హయాములో ఎన్నో రోడ్లు మరియు డ్రైనేజీ నిర్మాణాలు జరిగాయి కానీ ఈ వైకాపా ప్రభుత్వం గడిచిన ఐదు సంవత్సరాల నుంచి ప్రజలను మభ్య పెట్టడం తప్పితే చేసిందేమీ లేదు. ఎక్కడ వేసిన బొంగలి అక్కడే ఉంది కేవలం ఒక నాలుగు రోడ్లు వెడల్పు చేసినంతమాత్రం అభివృద్ధి అని అన్నారు. పట్టణంలోని ప్రజలంతా ఈ సైకో పరిపాలనను పారదోలడానికి సిద్ధంగా ఉన్నారు. రానున్న ఎన్నికలలో ఓటు అనే ఆయుధంతో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు ఏచూరి రాము, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసర్ల లక్ష్మీనారాయణ, పట్టణ పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ శ్రీనివాస చారి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శాఖమూరి స్వర్ణలత సీనియర్ నాయకులు శాఖమూరి వంశీధర్, షేక్ కాజా, మనుబోతుల శ్రీరామ్, వడ్డెల్లి సాంబశివరావు, పంగా సతీష్, కుప్పాకుల శ్రీనివాసరావు, కొమరగిరి సత్యనారాయణ, రవితేజ దామాల రవి, దారెల్లి బుజ్జి, అన్నం బుచ్చిబాబు, వీసం జగదీష్, రాటకొండ రమణ, చలమాల కృష్ణ, తంబాలపల్లి వెంకన్న, షేక్ మౌలాలి, షేక్ వద్దండు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సులో టికెట్ రూ.10 రూపాయలే




గుంటూరు రూరల్, మెజార్ న్యూస్: గుంటూరు నుండి పర్చూరుకు రాకపోకలు సాగించే ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులో ఎక్కడ ఎక్కినా, దిగిన ఛార్జ్ కేవలం రూ. 10 లు మాత్రమేనని డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ రవికాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ సి.టి.ఎం (O&C) శ్రీ అబ్రహం ఆధ్వర్యంలో గుంటూరు -1 డిపో మేనేజర్ రామకృష్ణ పర్యవేక్షణలో ప్రయాణీకుల సౌలభ్యం కొరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా దీనికి సంబంధించిన పోస్టర్ ను డి పి టి ఓ ఆవిష్కరించారు. ఏటుకూరు నుండి ఎన్టీఆర్ బస్టాండ్ వరకు మరియు గుంటూరు బస్టాండ్ నుండి ఎత్తు రోడ్డు, వెంకటేశ్వర స్వామి గుడి, నల్ల చెరువు - 6వ లైన్, మూడు బొమ్మల సెంటర్, బైపాస్ వరకు ప్రయాణికులు ఈ అవకాశం ను ఉపయోగించుకొన వలసినదిగాను మరియు ఆర్టీసీ వారు అందించే వివిధ రకాల రాయితీలను వినియోగించ కొనవలెనని ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన జిల్లా వైద్యాధికారి



గుంటూరు వైద్యంమేజర్ న్యూస్ : జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నందు 03.03.2024న జరిగే పల్స్ పోలియో కార్యక్రమం పై జిల్లాలోని వైద్యాధికారులు మరియు సూపర్వైజర్లకు, డాక్టర్. కె. విజయలక్ష్మి, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ 5 సంవత్సరముల లోపలి పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు ఇప్పించాలని, జలుబు,దగ్గు ఉన్న ఈ చుక్కలు ఆపరాదని, సంచార జాతులు, యాచకులు, ఇటుక బట్టీలు, వివిధ పరిశ్రమలలో పనిచేయు కార్మికుల పిల్లలు, ఇంతకుముందు వేయించుకోని ప్రతి పిల్లవానికి తప్పనిసరిగా పోలియో చుక్కలు ఇప్పించాలని తెలియజేసినారు. డా. స్టెఫి, సర్వేలన్స్ మెడికల్ ఆఫీసర్ గారు మాట్లాడుతూ, మార్చి 3 వ తారీఖున బూత్ యాక్టివిటీ జరుగుతుందని, 4 వ తారీకు నుండి 5వ తారీకు వరకు గ్రామీణ ప్రాంతాలలో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తారని,6 వ తారీకు న మున్సిపాలిటీలలో పోలియో చుక్కల కార్యక్రమం కొనసాగుతుందని, జిల్లాలో 1,45,097 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయుటకు 9000 వయల్స్ అవసరమని,18 ట్రాన్సిట్ పాయింట్స్ ఉన్నాయని, వైద్య మరియు ఆరోగ్య శాఖలో పనిచేయు ప్రతి ఒక్కరూ ముఖ్యముగా ఆరోగ్య కార్యకర్తలు ఆశ కార్యకర్తలు అంగన్వాడీ టీచర్లు సూపర్వైజర్లు పాల్గొని విజయవంతం చెయ్యాలని కోరినారు. ఈ కార్యక్రమములో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్.దాసరి శ్రీనివాసులు,డాక్టర్ ఏ శ్రావణ్ బాబు, డాక్టర్. చుక్కా.రత్న మన్మోహన్, డాక్టర్.ఈ. అన్నపూర్ణ, డాక్టర్. బి.లక్ష్మ నాయక్ పాల్గొన్నారు

## శరవేగంగా జి బి సి రోడ్డు విస్తరణ పనులు



పొన్నూరు మేజర్ న్యూస్ : పొన్నూరు పట్టణంలోని జిబిసి రోడ్డు అభివృద్ధి నిర్మాణ పనులు బుధవారం వేగవంతంగా జరుగుతున్నాయి. సైడ్ కాలువ నిర్మాణం పూర్తయి బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మట్టిని తొలగిస్తున్నట్లు ఆర్ అండ్ బి ఎఈ రాంబాబు మీడియాకు తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరలో అభివృద్ధి పనులు పూర్తి అయ్యేటట్లు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు

## దిశ స్టేషన్ సీఐగా వేమారెడ్డి



గుంటూరు క్రైం, మేజర్ న్యూస్: గుంటూరు దిశ పోలీస్ స్టేషన్ సీ ఐగా కె వేమారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. 1995 బ్యాచ్ కి చెందిన ఆయన నెల్లూరు జిల్లా నుంచి బదిలీ పై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న నరేష్ కుమార్ నగరంపాలెం స్టేషన్ కు బదిలీ అయ్యారు. స్టేషన్ కు వచ్చిన మహిళల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, పారదర్శకంగా కేసులను విచారించి బాధితులకు న్యాయం చేస్తానని సీఐ వేమారెడ్డి వెల్లడించారు.

# దుగ్గిరాల మండలంలో నిస్తేజమైన వైసిపి

దుగ్గిరాల, మేజర్ న్యూస్ : దుగ్గిరాల మండలంలో వైసిపి పరిస్థితి అస్తవ్యస్తంగా తయారవడంతో దేశం పార్టీ బాగా పుంజుకుని వైసిపి ప్రభుత్వం పోకడలను ప్రజలకు తెలియజేస్తున్న తరుణంలో వైసిపి పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన గల వైకాపా పార్టీ దుగ్గిరాల మండలంలో నిస్తేజంగా మారింది .పార్టీ పదవులు వివిధ చైర్మన్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవులను భర్తీ చేసి శాసనసభ్యులను ఇన్చార్జిల పేరుతో స్థానచలనం చేయడంతో పాటు గత రెండు పర్యాయములు మంగళగిరి నియోజకవర్గం నుండి గెలుపొందిన ఆళ్ళ రామకృష్ణారెడ్డి వైకాపా పార్టీకి రాజీనామా చేయడంతో కార్యకర్తల మధ్య నాయకులు మధ్య సత్సంబంధాలు సన్నగిల్లి అసంతృప్తికి గురవుతున్నారు. ఇటీవల నిర్వహించిన పార్టీ కార్యక్రమాలకు దుగ్గిరాల మండలం నుండి సర్పంచులు సీనియర్ నాయకులు నామ మాత్రంగా హాజరుకావడమే ఇందుకు తార్కానమని పరిశీలకులు భావిస్తున్నారు .ఈ పరిస్థితికి కారణం ఆళ్ల రామకృష్ణారెడ్డి పార్టీ శాసనసభ్యత్వానికి పార్టీకి రాజీనామా చేయడంతో పాటు మండల అభివృద్ధికి తగిన రీతిలో నిధులు మంజూరు చేయకపోవడమేననేది ఎమ్మెల్యే వాదన .దుగ్గిరాల మండలంలో అభివృద్ధి నానాటికి కు0టుపడిందని రోడ్లు, రహదారులు అస్వస్థంగా మారాయని కాలువలు వంతెనలు రిపేర్లకు నోచుకోలేదని వైసిపి పార్టీ సీనియర్లను సర్పంచ్లను ఎంపీటీసీలను ఎమ్మెల్యే పట్టించుకోనందున నాయకులు వైసిపి పార్టీ పట్ల తీవ్ర అసంతృప్తితో కొట్టుమిట్టాడుతూ ఉంటూ తెలుగుదేశం పార్టీ నీడన చేరడం జరిగింది .దుగ్గిరాల మండలంలో 2019 ఎన్నికల్లో పోటీ చేసిన ఆళ్ల రామకృష్ణారెడ్డిని మండల వైసీపీ నాయకులు గెలుపే ధ్యేయంగా ఆర్కెను భుజాన వేసుకుని గెలిపించిన నాటి నుండి నేటి వరకు నాయకులను పట్టించుకోకపోవడంతో వైసిపి నాయకులు మధ్య కులాల కుమ్ములాటలు మనస్పర్ధలు వ్యక్తిగత కక్షలు మరింతగా పెరిగి వైసిపి పార్టీ. పరువు నడిబజార్ కెక్కి చివరకు నిస్తేజంగా మారింది. దీనితోడు మండలంలోని పరిష్కారం కాకుండా పేరుకుపోయిన పెండింగ్ సమస్యలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో వైసిపి నాయకులు నేడు వరుసగా వలసలు గా తెలుగు దేశం పార్టీ. ప్రధాన కార్యదర్శి యువ గళం అధినేత నారా లోకేష్ సమక్షంలో తెలుగుదేశం కండువాలను వేసుకోవడం జరిగింది. వైసిపి పార్టీ జిల్లా నాయకులు మంత్రులు మండల అభివృద్ధిపై దృష్టి పెట్టనందున ,తెలుగుదేశం పార్టీ వైపు వైసిపి నాయకులు చూపు చూడడంతో, వైసీపీ పార్టీకి దుగ్గిరాల మండలంలో పూర్తిస్థాయిలో గండి పడింది. మంగళగిరి నియోజకవర్గంలోని ఆళ్ళ రామకృష్ణారెడ్డి పార్టీకి రాజీనామా చేయడం ఆ తదుపరి నియోజకవర్గ ఇన్చార్జి గంజి చిరంజీవి 2024 లో వైసీపీ పార్టీ నుండి పోటీ చేసేందుకు సిద్ధం కావడంతో పార్టీలోనీ ప్రజా ప్రతినిధుల మధ్యఏర్పడిన గ్రూపులు నాయకుల మధ్య సత్సంబాలు సన్నగిల్లి ఎడమొఖం పెడ ముఖం. గా తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. దుగ్గిరాల మండలంలో వైసిపి పార్టీ నుండి మెజార్టీ సభ్యులు తెలుగు దేశం పార్టీలోకి వలసలుగా చేరడంతో దుగ్గిరాల మండల వైసిపి పార్టీకి గండి పడడమే గాక తెలుగుదేశం పార్టీ నుండి మంగళగిరి నియోజకవర్గంలో పోటీ చేస్తున్న నారా లోకేష్ గెలుపు తథ్యమనే మాటలు వేగంగా ప్రజల నుండి తూటాలుగా వినవస్తున్నాయి .దీంతో పాటు గత వారం రోజుల క్రితం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని దుగ్గిరాల మండలం తో పాటు మంగళగిరి నియోజకవర్గం లోని గ్రామాలలో తో పాటు రాష్ట్రంలో పెద్ద ఎత్తున జన్మదిన సంబరాలు అటహాసంగా జరగడంతో ,తెలుగుదేశం. పార్టీ గ్రాఫ్ పూర్తిస్థాయిలో పెరిగి వైసిపి పార్టీకి ఆదరణ తగ్గి దుగ్గిరాల మండలంలో వైసీపీ పార్టీ నిస్తేజంగా కనిపిస్తోంది. వైసిపి పార్టీలో నెలకొన్న నిస్తేజాన్ని గుర్తించిన తెలుగుదేశం పార్టీ తమ బలాన్ని పూర్తిస్థాయిలో పెంచుకునేందుకు మండలంలోని గ్రామాలలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వడివడిగా అడుగులు వేస్తూ ముందుకి పోతుంది. దుగ్గిరాల గ్రామంలోని రైలు పేటలో అన్న క్యాంటీన్ ప్రారంభించి ప్రజలకు దగ్గర అవడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేయడంతో వైసిపి పార్టీ ముందుకు అడుగు వేయలేక వెనకకు రాలేక దుగ్గిరాల మండలంలో నిస్తేజంగా మారిందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

## మాజీ మంత్రి కన్నా పై జరిగిన దాడి అప్రజాస్వామికం : చందు జనార్ధన్



తెనాలి,మేజర్ న్యూస్: మాజీమంత్రి కన్నా లక్ష్మి నారాయణపై పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం, కొండెపి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన దాడిని రాష్ట్ర కాపు జేఏసీ ఖండించింది.కాపు కుటుంబ పెద్ద అయినటువంటి కన్నా లక్ష్మి నారాయణ జరిగిన దాడి సహేతుక మైనది కాదని రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్ధన్ విమర్శించారు. ఈ సందర్భంగా బుధవారం తెనాలిలో ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో విమర్శలు ప్రతి విమర్శలు ఉండటం మంచిదే కానీ ప్రత్యక్ష దాడులు సరైన విధానం కాదని ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అయన ఆరోపించారు. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో వివిధ రంగాల్లో ఉన్న కాపు ముఖ్యులపై జరుగుతున్న దాడుల పట్ల కాపు,తెలగ,బలిజ,ఒంటరి ,మున్నూరు కాపు కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని చందు జనార్ధన్ సూచించారు.రాజకీయాలకు అతీతంగా సమాజంలో కాపు కుటుంబ సభ్యులను కాపాడుకోవాల్సిన అవసరం ,ఐక్యతతో ముందు కెళ్లాల్సిన అవసరం ఉందని అయన తెలిపారు. కాపు కుటుంబ పెద్ద సుదీర్ఘ నాయకత్వ పటిమ కలిగిన కన్నా లక్ష్మి నారాయణపై జరిగిన దాడి కాపు కులం హెచ్చరికగా భావించాలని జరిగిన సంఘటనను రాష్ట్ర కాపు జేఏసీ తీవ్రంగా ఖండిస్తోందని కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్ధన్ స్పష్టం చేసారు.

# పేషెంట్లతో ఫ్రెండ్లీగా ఉండాలి

గుంటూరు వైద్యం మేజర్ న్యూస్ : ప్రభుత్వ ఆసుపత్రికి ప్రజలు నమ్మకంతో వచ్చినప్పుడు బాధ్యతలు కూడా మరువకూడదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం సూపరింటెండెంట్ ఛాంబర్ లో ప్రజా హక్కుల జె ఏ సి , హెల్ప్ లైన్ ఆధ్వర్యం లో నూతన డైరీ , క్యాలెండర్ ను సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆవిష్కరించారు. ఆసుపత్రి కి వచ్చే రోగి వెంట ఒకరి కంటే ఎక్కువ మంది రావడం వల్ల ఆసుపత్రి వాతావరణం కలుషితంగా మారుతోందని డాక్టర్ కిరణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. అలా అని ఆసుపత్రికి సహాయకులు ఎవరు రావద్దని చెప్పలేమని ఆయన చెప్పారు. ఎక్కువమంది రావడం వల్ల ఆసుపత్రి పరిసర ప్రాంతాలన్నీ అపరిశుభ్రంగా ఉండే పరిస్థితి కనిపిస్తోందని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతలను తెలుసుకుని ఆసుపత్రి వాతావరణ్నన్ని కాపాడుకోవలసిన అవసరం ఉందని అయన చెప్పారు. స్వచ్ఛంద సేవ సంస్థలు కూడా ప్రజల బాధ్యతల గురించి వివరించాల్సిన అవసరం ఉందని అయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాహక్కుల జె ఏ సి జొన్నలగడ్డ వెంకటరత్నం, ఉపాధ్యక్షుడు లక్ష్మణారావు, డి రవి, బోనబోయిన సాయిరాం, హెల్ప్ లైన్ సభ్యులు బిట్రా వెంకట్రావ్, ధర్మనారాయణ సింగ్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇక నుంచి గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపి రోజు మార్చి రోజు నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో లో ఈ ఓ పి రెండు రోజులు మాత్రమే ఉండేదని ఆయన గుర్తు చేశారు. ప్రజల సౌకర్యార్థం మంగళ, గురు, శనివారాల్లో ఓ పి ని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఆసుపత్రి వ్యవస్థ లో నర్సింగ్ సేవలు ఉన్నతమైనవని ప్రభుత్వ ఆసుపత్రి సువరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం కార్యాలయం లో ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలోలో 2024 సంవత్సర క్యాలెండరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నర్సింగ్ సేవలను వెల కట్టలేమన్నారు. ప్రయివేట్ ఆసుపత్రులు అయినా ప్రభుత్వ ఆసుపత్రులు అయినా రోగులకు ఉన్నతమైన సేవలు అందజేస్తున్నాయని అంటే దానికి ముఖ్య కారణం నర్సింగ్ వ్యవస్తే అని అన్నారు. అటువంటి నర్సింగ్ సిబ్బందికి ఎటువంటి సమస్యలు వచ్చిన వాటిని తీర్చడానికి ఏపి ఎన్ఎస్ఎస్ ఏపీఎన్ఎస్ఎస్ సిద్ధంగా ఉందని, తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఒకే మాటగా ఉండాలన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి లో ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏపీ ఎన్ఎస్ఎస్, ఏపీ ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు స్వచ్ఛంద ప్రసాద్ మాట్లాడుతూ నర్సింగ్ సిబ్బంది అయినా నర్సింగ్ విద్యార్థులు అయినా ఏ సమస్యలో ఉన్న ఆ సమస్యల పరిష్కారం కోసం తామెప్పుడు సిద్ధం గా ఉన్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ సాధనే ధ్యేయంగా ముందడుగు వేయబోతున్నామని ఈ సందర్భంగా తెలిపారు. 2024 క్యాలెండర్ ఆవిష్కరించినందుకు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు. క్యాలెండర్ ఆవిష్కరణలో నర్సింగ్ సూపరిండెంట్ గ్రేడ్ 1 లు ఆశ సజని, గంగమ్మ మరియు స్టాఫ్ నర్సులు హేమలత, షబాన తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి లో నర్సింగ్ ఆఫీసురులు గా పని చేసిన వడ్లమూడి రాజకుమారి, శావ పద్మజలు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నేతలు మతిభ్రమించి మాట్లాడితే ఊరుకోం... తెదేపా నాయకులు



పొన్నూరు మేజర్ న్యూస్ : ఈనెల 29న వడ్లమూడి లో "రా కదిలిరా "సభకు వచ్చిన ప్రజానీకం చూసి వైకాపా నాయకులు మతిభ్రమించమాట్లాడు తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు దుయ్య బట్టారు పొన్నూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెదేపా నాయకులుమా ట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ను విమర్శించే స్థాయి అర్హత మీకు లేదని వారు హెచ్చరించారు. పొన్నూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బండ్లమూడి బాబురావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుగా వ్యవహరిస్తున్నాడని ఎద్దేవా చేశారు. ధూళిపాల నరేంద్ర కుమార్ పాదయాత్రతో 700 ఎకరాలలో అక్రమ మైనింగ్ చేసి వేలాది కోట్ల రూపాయలు కిలారి దోచుకున్నాడని బయటపడిం దని పేర్కొన్నారు. మైనింగ్ మాఫియా రంగును దూళిపాళ్లకి పులిమి తప్పించుకోవాలని చూస్తున్నా దని ఒక వేలు నువ్వు చూపిస్తే 4 వేళ్ళు నీ వైపు చూపిస్తున్నాయని అది తెలుసుకోవాలని ఆయన పేర్కొన్నారు.సంగం డెయిరి గురించి ఏం తెలుసు అని మాట్లాడుతున్నావు రోశయ్య... అది రైతుల కు సంబంధించిందని 100 కోట్ల సంగం డెయిరి టర్నవర్ని 1100 కోట్ల స్థాయికి తీసుకువచ్చింది ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ రే అనేది జగమెరిగిన సత్య మని ఆయన పేర్కొన్నారు.పొన్నూరు పట్టణంలో రోడ్డు విస్తరణ పేరుతో భవన యజమానులను బెదిరించి వాళ్లకు ఆత్మహత్యలయ శరణం అనేదాక తీసుకువెళ్లిన ఆ ఘనత నీది కదా కిలారి...గ్రామాలలో మట్టి తవ్వకాలతో దోచుకు న్నది నీవు కాదా రోశయ్యా.. అని ఆయన నిలదీ శారు. ఒకసారి నువ్వు వెనక్కి తిరిగి చూసుకుంటే నీ అక్రమాలు కో కలలు శివాలయంలో మాంసా హారాలు వండించడం, చెక్ పోస్టు భాష హత్య, స్టూడియో యజమాని మయూరి అబ్దుల్లా కుమా రుడు రబ్బానీ మరణం, దళితుడు బర్బన్ ఖాన్ హత్య బయటపడతా యన్న విషయం కిలారి గుర్తుంచు కోవాలని ఆయన హెచ్చరించారు .ఎమ్మెల్యే స్థాయిలో మాట్లాడు పదవి విలువ ఇవ్వు తుఫానుకు పంట నష్టపోతే రైతులు కాకుండా వాలంటీర్లకు పరిహారం రాయించిన ఘనత నీది కాదా అని ఆయన నిలదీశారు . అంబేద్కర్ పేరును విదేశీ విద్య పథకానికి తొలగించి అవమానించింది మీ నాయకుడు జగన్ రెడ్డి అని గుర్తుంచుకోవాల న్నారు. సాక్షి శ్రీ భావనారాయణ స్వామి విలువైన భూములపై నీ కన్ను పడి భూము లు కబ్జా చేసేందుకు ప్రయత్నిం చినది నువ్వు కాదా అని నిలదీ శారు. పొన్నూరు పట్టణ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు పఠాన్ అహ్మద్ ఖాన్ గారు మాట్లాడుతూనిన్న మొన్న వచ్చిన సైఫుల్లా మైనార్టీల ను ఉద్ధరించినట్లు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.సిటీ కేబుల్ మీ నాన్నకి ఎలా వచ్చిందో ముందు నువ్వు తెలుసుకో మనీ ఆయన హితో పలికారు .ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన గుండా సాంబశివరావు నుండి సిటీ కేబుల్ ను లాక్కున్నది మీ నాన్న యాసిన్ అని నీవు తెలుసుకో ముందు సైఫుల్లా... సిటీకేబుల్ సెటిల్మెంట్ చేయమని టిడిపిని ఆశ్రయించింది మీరు కాదా?. అని నిలదీశారు పేద మైనార్టీలను దోచుకొని మీ సంపదను పెంచుకున్నారే తప్ప మైనార్టీలకు ఏం చేయలేదని ఆయన ఎద్దేవా చేశారు. మీ ఎదుగుదలకు సహకరించిన మీ నాన్న మేనల్లుడు చనిపోతే ఎందుకు మీరు వెళ్ళలేదు చెప్పాలి. అదేవిధంగా షేక్ కార్పొరేషన్ చైర్మన్ గా ఉన్న మీ నాన్న మైనార్టీలకు చేసిన ఒక్క పథకం గురించి చెప్పమనీ నిలదీశారు. ఇప్పుడు దానికే డైరెక్టర్ గా ఉన్న నువ్వు మైనార్టీలకు ఎన్ని రుణాలు ఇచ్చావో నువ్వు చెప్పు అని ప్రశ్నించారు.నీ ఇంటి దగ్గర ఉన్న మసీదు, నమాజ్ కు వచ్చే ముస్లిం బైకులు సైకిల్ ధ్వంసం చేసింది మీ నాన్న నీవు కాదా అని ప్రశ్నించారు నీ కొత్త కారు ఇంటికి వెళ్లేందుకు మార్గం లేక పేదవాడు అమాయకుడైన మైనార్టీ కి చెందిన వ్యక్తి షాపు కూల్చి రోడ్డు ఆక్రమించి దారి వేసుకున్నది నువ్వు కదా సైఫుల్లా!. సెంటర్లో ఉన్నావా యాసిన్ ప్లాజా ఎలా వచ్చిందో నీకు తెలుసా.. బ్రిటిష్ హయాంలో పట్టాలు పొందిన పేదలను బెదిరించి స్థలం లాక్కుంది మీ నాన్న ఈ విషయం కోర్టులో పెండింగ్లో ఉన్న విషయం మీకు తెలుసా?... ఎంతమంది పేద మైనార్టీ జీవితాలను నాశనం చేసిన మీరు ఇలా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఆయన నిలదీశారు. అప్పుడు ఇప్పుడు మైనార్టీలకు అండగా నిలిచింది. ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ లిఒక్కరే... షాదీ కా నాకు నిధులు తెస్తే నాలు గున్నర సంవత్సరాలలో ఒక ఇటుక అయినా కట్టారా, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే బాగుం టుంది సైఫుల్ల అని హెచ్చరించారు.కాపు నాయ కుడు చలమశెట్టి సీతారామయ్య మాట్లాడుతూ... ప్యాకేజీ నాయకుడు కోట శ్రీనివాసరావు మాట్లా డటం హాస్యాస్పదంగా ఉందని నిన్న మొన్నటిదాకా టిడిపిలో చేరుతానని మాతో మాట్లాడినది నీ ఎమ్మె ల్యేని తిట్టింది వాస్తవం కాదా? అని పేర్కొన్నారు. సంవత్సరానికి ఒకసారి పొన్నూరు వచ్చే నువ్వా కాపు అభివృద్ధి గురించి మాట్లాడేదని ఆయన నిలదీశారు .వార్డు మెంబర్గా కూడా గెలవలేని నిన్ను జడ్పీటీసీగా గెలిపించింది ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అనేది గుర్తుంచుకోవాలన్నారు. నువ్వు చేస్తున్న అక్రమాలు నరేంద్ర కుమార్ ప్రశ్నించి నందుకే అలిగి వెళ్లిపోయింది నువ్వే కదా అని ఆయన గుర్తు చేశారు.వెళ్లిన పార్టీలైనా తిన్నగా ఉన్నావా నిన్ను తీసుకెళ్లిన నాయకుడికి వెన్నుపోటు పొడిచిన నీవుసొసైటీ ప్రెసిడెంట్ ఎన్నికలు కాకుండానే నియమితులైన నువ్వు ఆ సొసైటీలో చేసిన అక్రమాల చిట్టా మొత్తం బయట పెట్టమం టావా అని ఆయన ప్రశ్నించారు. మహిళా నాయ కురాలు పోలవరపు రత్నకుమారి మాట్లాడుతూధూ ళిపాళ్ళ నరేంద్ర కుమార్ గురించి అవాకులు చవాకులు మాట్లాడితే నాలుక కోస్తామని ఆమె హెచ్చరించారు. మా నాయకుడు నరేంద్ర అన్న గురించి వ్యక్తిగతంగా మాట్లాడితే దేహశుద్ధి తప్పదని, నీకు పొన్నూరు నియోజకవర్గంలో మా నాయకుడు వేసిన రోడ్లపై నడుస్తున్న మీరు మీ నాయకుల మా నాయకుడు గురించి మాట్లాడేది అని ప్రశ్నించింది... ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు సంక్షేమ పథకాలను దళిత వాడను అభివృద్ధి చేసింది మా నరేంద్రన్న అనేది జగమెరిగిన సత్యం... ఈ నాలుగు సంవత్సరాలు ఐదు నెలల కాలంలో మీ నాయకుడు ఎమ్మెల్యేగా ఏం చేశాడో చెప్పగలవా అని ఈ సందర్భంగా సవాల్ విసిరారు. అభివృద్ధిపై బహిరంగ చర్చకు మేమంతా సిద్ధమని తెదేపా నాయకులు సవాల్ విసిరారు.

## జగనన్న నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు..ఎమ్మెల్యే కిలారి



పొన్నూరు మేజర్ న్యూస్ : మారుమూల గ్రామాల్లో సైతం మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తూ ప్రజా సంక్షేమమే పరమావధిగా సీఎం జగన్ మోహన్ రెడ్డి ముందుకు సాగుతున్న రని ఎమ్మెల్యే కిలారి రోశయ్య పేర్కొన్నారు. పొన్నూరు మండలం చిన్న ఇటికంపాడు గ్రామంలో రూరల్ హెల్త్ క్లినిక్ నుబుధవారం ఆయన ప్రారంభించారు. పైసా ఖర్చు లేకుండా గ్రామంలో కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. విద్యా వైద్యం వ్యవసాయ రంగాలలో వైయస్ జగన్మోహన్ రెడ్డి సమూలమైన మార్పులు తీసుకురావడంతో పాటు వాటిని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తీర్చిదిద్దారన్నారు. వైద్యం అందక ఏ పేదవాడు ఇబ్బంది పడకూడదని వైద్య రంగంలో సమూలమైన మార్పులు తీసుకురావడం ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని ప్రతి పేదవాడికి చేరే విధంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారని ఆయన పాలనలో ప్రజలు పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న ఓటరు దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఎస్-ఎస్ఆర్ 2024 కు సంబం ధించి అన్ని ప్రక్రియలు పూర్తి చేసి జనవరి 22 వ తేదీ ఓటర్ల తుది జాబితాను ప్రచురించడం జరిగిందని , తుది జాబితా ప్రచురణ అనంతరం అందిన దరఖాస్తులు , పెండింగ్లో వున్న దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాల్సి వుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయం త్రం కలెక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి , నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తీ చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ , జిల్లా రెవెన్యూ అధికారి కే.చంద్రశేఖరరావు తో కలసి ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ తరుపున డా. తాతా సేవా కుమార్ (రాష్ట్ర ఉపాధ్యక్షులు), బహుజన్ సమాజ్ పార్టీ తరపున చిరతనగండ్ల వాసు (గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్ చార్జ్ ) , భారతీయ జనతా పార్టీ తరుపున రాచుమల్లు భాస్కర రావు( జిల్లా జనరల్ సెక్రెటరీ), ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున బిళ్ళా సునీల్ (జిల్లా ప్రధాన కార్యదర్శి , జిల్లా ఆఫీస్ ఇన్చార్జి) , తెలుగుదేశం పార్టీ తరుపున కంచర్ల శివరామయ్య (కార్యలయ సెక్రటరీ) పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితా తుది ప్రచురణ తదుపరి వచ్చిన క్లైమ్స్ ను క్షుణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. బిఎల్ఓ లు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్ళి ఓటర్ వెరిఫికేషన్ చేయాలని , బిఎల్ఓ లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఓటరు నమోదు ప్రక్రియలో అవకతవకలకు పాల్పడినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డూప్లికేట్ ఓట్లను , డబుల్ ఎంట్రీలను గుర్తించి సరిచేయాలని , ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లను ఒకే పోలింగ్ కేంద్రాలలో వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణ కొరకు నియమించిన నోడల్ అధికారులు మరియు సపోర్టింగ్ స్టాఫ్ ఎన్నికల నియమావళిని క్షుణ్ణంగా చదివి అవగాహన పెంచుకొని ఎన్నికల విధులు నిర్వహించాల న్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరిని ఓటర్ల జాబితాలో చేర్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రవీంద్రరావు, లక్ష్మీకుమారి, ఆర్డీవో శ్రీకర్, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, పీడీ డీఆర్డీఏ హరిహరనాథ్, తహశీల్దార్లు సిద్ధార్థ, నాసరయ్య, షేక్. మహబూబ్ సుభాని, మల్లేశ్వరి, రామ్ ప్రసాద్, పొన్నూరు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, యంటీయంసీ డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, జియంసి డిప్యూటీ కమిషనరు -2 సిహెచ్ శ్రీనివాస్, కలక్టరేట్ కో ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ శిరీష పాల్గొన్నారు.

# శివాలయములో టెండరు కమ్ బహిరంగ వేలము పాటలు



పెదకాకాని మేజర్ న్యూస్ : పెదకాకాని శివాలయ ము నందు 2024-2025 ఆర్థిక సంవత్సరము నకు ఇ-టెండరు, సీల్డ్ టెండరు మరియు బహిరంగ వేలము పాటలు బుధవారము ఉదయం ఆర్. రమణమ్మ, సహాయకమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి, భావన్నారాయణ స్వామి వారి దేవస్థానము, పొన్నూరు వారి పర్యవేక్షణలో ధర్మకర్తలమండలి ఛైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు మరియు ధర్మకర్తలమండలి సభ్యులు సమక్షములో కార్యాలయము నందు నిర్వహించినట్లు ఆలయ సహాయకమీషనరు యస్. శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొత్తము వేలము పాటలు 24కు గాను 11 సీల్డ్ టెండరు మరియు బహిరంగ వేలము పూర్తి అయినదని మిగిలిన పాటలను తదుపరి తేదీని నిర్ణయించుటకు జరుగునని తెలిపారు. బుధవారం జరిగిన పాటలలో (1) కొబ్బరికాయల షాపునకు రూ.60,03,000/-లు (2) టెంట్ హౌస్నకు రూ.6,80,000/- (3) గ్యాస్ స్టౌవ్లు అద్దెకు రూ. 15,00,300/-లు (4) గోశాల వద్ద పచ్చి గడ్డి విక్రయ పాటకు రూ.1,50,000/- (5) విభూధి విక్రమ పాట రూ. 42,000/-లు మరియు దేవస్థానమునకు సరఫరా చేయు శేషవస్త్రములు, పూలు, స్టేషనరీ, ప్రింటింగ్, కూరగాయలు, పాలు సరఫరాకు టెండరు ఖరారు అయ్యాయి బహిరంగ వేలము పాటల నందు పాలకమండలి సభ్యులు కొమ్మూరి శివరత్నాలు, కారంకి శివనాగేశ్వరమ్మ, గంగవరపు మల్లేశ్వరరావు, గుమ్మళ్ళ వెంకటరావు, పాలడుగు వెంకటేశ్వరరావు, పాటదారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు


కావలెను

**మహావీర్ మెమోరియల్ జూనియర్ కళాశాల**

ఇందిరాగాంధీ నగర్, గుంటూరు.

పైనుదహరించిన ఎయిడెడ్ కళాశాలలో **'ఆఫీస్ సబార్డినేట్ (అటెండర్) (S.C. బ్యాక్‌లాగ్ ఎయిడెడ్ పోస్ట్)** గా పని చేయుటకు దరఖాస్తులు కోరడమైనది. 7వ తరగతి పాస్ అయిన అభ్యర్థులు అర్హులు. ఎస్సీ (జనరల్) వారికి రిజర్వు చేయబడినది. అభ్యర్థులు గుంటూరు జిల్లా వారై ఉండాలి. 7వ తరగతి విద్యార్హత సర్టిఫికెట్లు, తహశీల్దార్ వారితో జారీచేయబడిన కుల ధృవీకరణ పత్రం జతచేస్తూ పూర్తిచేసిన దరఖాస్తును 30 రోజులలోగా దిగువ తెలిపిన అడ్రస్ వారికి పంపవలెను. వయస్సు, జీతం, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిగణించబడును.

**సెక్రటరీ & కరస్పాండెంట్**

**మహావీర్ మెమోరియల్ జూనియర్ కళాశాల**

**ఇందిరాగాంధీ నగర్, గుంటూరు-522003.**

తేది: 01-02-2024


## అలరించిన భక్తి సంగీత విభావరి



గుంటూరు (సాంస్కృతికం) మేజర్ న్యూస్ : స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం డాక్టర్ జె. జయప్రకాశ్, హోమియో వైద్యులు వర్ధంతి సందర్భంగా శ్రీ వేంకటసాయి సంకీర్తన బృందం ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీ గాయకులు కె. ఆనంద్, జి. సువర్ణ విద్య బృందం పలు భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు.

## మల్టీస్పెషాలిటీ హాస్పటల్ పై ఐటీ కన్ను



గుంటూరు వైద్యం మేజర్ న్యూస్ : స్థానిక గౌరీ మటన్ దగ్గర అమ్మ పేరుతో నడుస్తున్న మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ పై త్వరలో ఐటి దాడులు జరగనున్నట్లు విశ్వసనీయ సమాచారం గతంలో ఓల్డ్ క్లబ్ రోడ్ లో లైఫ్ హాస్పటల్ పేరుతో వైద్యం అందించకుండా ఎంతోమంది ప్రాణాలతో చెలగాటం ఆడిన యాజమాన్యం పేషెంట్లు తిరుగుబాటుతో పలుమార్లు గొడవలు జరిగిన సంఘటనలు జరిగాయి దీంతో గౌరీ మఠం దగ్గర నిబంధనలువిరుద్ధంగా రెండు బిల్డింగులతో అనుసంధానం చేస్తూ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ప్రారంభించారు అధికారంలో ఉన్న రాజకీయ నాయకులు సపోర్టు ఉన్నట్లు ప్రచారం నిర్వహించడంలో వారికి ఎవరు చాటిరారు ప్రస్తుతం ఆస్పటల్ లో అనేక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి పేదవాడికి మెరుగైన అత్యున్నత స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రైవేట్ హాస్పటల్లో ఏర్పాటు చేసినట్లు ప్రచారం చేసుకునే యాజమాన్యాలు పేషంట్లను జలగల్లాగా పీల్చి పిప్పి చేస్తున్నారు చేస్తున్నారుఆరోగ్యశ్రీ ఈ మధ్యకాలంలో అనుమతి తెచ్చుకున్న ఆరోగ్యశ్రీ డబ్బులు కోసం కక్కుర్తి పడి అవసరం లేకపోయినా ఆపరేషన్ చేశారని ఆరోపణలు ఉన్నాయి స్థానికంగా లేని డాక్టర్ పేరుతో ఆరోగ్యశ్రీ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది ముఖ్యంగా బ్లాక్ మనీని వైట్ గా మార్చుకునే క్రమంలో హాస్పటల్ కి సంబంధించిన డబ్బులు గుడి పేరుతో వైట్ చేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి అనేక ఫిర్యాదులు అందడంతో త్వరలోనే హాస్పటల్ పై దాడులు జరుగుతాయని తెలుస్తోంది.

## జిఎంసి అదనపు కమిషనర్ గా రాజ్యలక్ష్మి



గుంటూరు, మేజర్ న్యూస్ : జిఎంసి అదనపు కమిషనర్ గా .మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ. వీసీ గా విధులు లో ఉన్న కే. రాజ్య లక్ష్మి.. ప్రస్తుతం అదనపు కమిషనర్ గా పనిచేస్తున్న కే లక్ష్మీ శివ జ్యోతి ఓ ఎన్ జి సి, ఆర్ఓ, గోపాలపురం కు బదిలీ చేస్తూ బుధవారం జీవో ఆర్ టి 218 జారీ చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి.

## ప్రజా సేవకు అంకితం అయితే ప్రజలను గుర్తింపు



గుంటూరు, మేజర్ న్యూస్ : ప్రభుత్వ ఉద్యోగులు తమ సర్వీస్ లో ఉన్నంతకాలం ప్రజా సేవకే అంకితం అవుతారని, రిటైర్మెంట్ అనంతరం కుటుంబంతో సంతోషంగా ఆరోగ్యంగా గడపాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అన్నారు. నేడు నగర పాలక సంస్థ సెక్రెటరీ పి.జె సంపత్ కుమార్ రిటైర్మెంట్ సందర్భంగా మేయర్ ఛాంబర్ నందు ఆయన శాలువా ,బోకేతో సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ,ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని, కాని ఉద్యోగ నిర్వహణలో ఎంత బాగా పని చేసి ప్రజా సేవ చేశామన్నదే ముఖ్యమన్నారు. సదరు క్మార్యక్రమంలో అదనపు కమీషనర్ లక్ష్మి శివ జ్యోతి, డిప్యూటి కమిషనర్లు టి. వెంకట కృష్ణయ్య, బి. శ్రీనివాసరావు, డి. శ్రీనివాసరావు,మేనేజర్ శివన్నారాయణ, సుపెరింటెండేంట్లు మదన్ గోపాల్, రవికిరణ్ రెడ్డి, బంధుమిత్రులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి నుంచి విజ్ఞాన్ మహోత్సవ్





గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ విజ్ఞాన్ మహోత్సవ్ కార్యక్రమాన్ని నేటి నుంచి మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. జాతీయస్థాయిలో ప్రతిఏటా విజ్ఞాన్ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. నేటి కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా చిందు యక్షజ్ఞానం ఆర్టిస్ట్ గద్దం సామయ్య (పద్మశ్రీ అవార్డు గ్రహీత), ఇండియన్ మ్యూజిక్ కంపోజర్ రఘు కుంచె హాజరవుతారని వెల్లడించారు. 3వ తారీఖున జరిగే ముగింపు కార్యక్రమానికి ఇండియన్ నేషనల్ క్రికెట్ టీమ్ మాజీ సెలక్టర్, క్రికెటర్ ఎమ్మెస్కే ప్రసాద్ రానున్నారని తెలియజేసారు. విజ్ఞాన్ మహోత్సవ్‌లో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల నుంచి 50వేల మంది విద్యార్థులు తరలి రానున్నారని వెల్లడించారు. విజ్ఞాన్ మహోత్సవ్ పోటీల విజేతలకు రూ.15 లక్షలకు పైగా బహుమతులను అందజేస్తామని తెలిపారు. విజ్ఞాన్ మహోత్సవాన్ని ఈ ఏడాది వినూత్నంగా నిర్వహించడంతో పాటు మొట్టమొదటసారిగా క్రికెట్ చాంపియన్‌షిప్‌ను ప్రారంభించామన్నారు.

**-మహోత్సవ్‌లో సందడి చేయనున్న సినీతారలు**

నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న విజ్ఞాన్స్ మహోత్సవ్‌లో సినీ తారలు సందడి చేయనున్నారు. 3న జరిగే ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇండియన్ ఫిల్మ్ యాక్టర్ కిరణ్ అబ్బవరం, ఇండియన్ స్క్రీన్ రైటర్ బుర్రా సాయి మాధవ్‌లు విచ్చేయనున్నారు. అంతేకాకుండా ఈ నెల 16న విడుదల కాబోతున్న "సుందరం మాస్టర్" సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా హీరో హర్ష చెముడు, హీరోయిన్ దివ్య శ్రీపాదలు 2వ తారీఖున సందడి చేయనున్నారు.

**-75 ఈవెంట్ల నిర్వహణ**

విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహోత్సవ్‌లో మొత్తం 75 ఈవెంట్లను నిర్వహించనున్నారు. తొలుత నిర్వహించే స్పోర్ట్స్ ఫీట్‌లో వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, త్రోబాల్ తదితర క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో విద్యార్థులకు పోటీలు ఉంటాయని చెప్పారు. వీటితోపాటు కల్చరల్స్, లిటెరరీ, ఫైన్ ఆర్ట్స్, ఫ్యాషన్, మ్యూజిక్, డాన్స్, స్పాట్‌లైట్, థియేటర్ ఆర్ట్స్ వంటి తదితర రంగాలను కలుపుకుని సాంకేతిక, సాంస్కృతికాంశాల్లో జాతీయస్థాయిలో పోటీలు ఉంటాయని వివరించారు. పారా అథ్లెటిక్స్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నామని తెలియజేసారు. దేశవ్యాప్తంగా విద్యార్థులంతా ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసే టెక్స్టైల్ కోర్సులు



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : టెక్స్ టైల్స్ టెక్నాలజీ కోర్సులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని , విద్యార్థులు ఈ కోర్సులను ఎంచుకోవటం ద్వారా తక్షణం ఉపాధి పొందవచ్చని రాష్ట్ర చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత తెలిపారు. బుధవారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో టెక్స్ టైల్స్ కోర్సు లపై అవగాహన కోసం విద్యార్థులకు నిర్వహించిన వర్క్ షాపులో రాష్ట్ర చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత , జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత మాట్లాడుతూ ఆశాజనకమైన అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, తెక్స్ టైల్స్ రంగంలో వృత్తిని ఎంచుకునేలా విద్యార్థులను ప్రేరేపించడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. టెక్స్ టైల్స్ రంగంలో విస్తారమైన అవకాశాలను నొక్కి చెబుతూనే వివిధ కోర్సులను అన్వేషించమని విద్యార్థులకు సూచించారు. ఒక వైపు నిరుద్యోగం, మరోవైపు ఇతర రంగాలలో తొలగింపుల సవాళ్ల నేపథ్యంలో వస్త్ర పరిశ్రమలో విద్యార్థులకు తక్షణ ఉద్యోగం అందుబాటులో ఉందన్నారు. టెక్స్ టైల్స్ లో భవిష్యత్తుకు గేట్‌వే అయిన ఆంధ్రప్రదేశ్ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ కు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ముఖ్య కార్యదర్శి కె.సునీత కోరారు. ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సుల కంటే టెక్స్ టైల్ కోర్సులను అభ్యసించటం వలన వెంటనే ఉద్యోగాలు పొందవచ్చన్నారు. టెక్స్ టైల్ రంగంలో డిమాండ్ తగినట్టు అభ్యర్థులు లేని కారణంగా చాలా వరకు ఉద్యోగాలు మిగిలిపోతున్నాయన్నారు. అవగాహన లేని కారణంగానే చాలా మంది టెక్స్ టైల్ కోర్సులను అభ్యసించలేకపోతున్నారని, ఎనిమిది నుంచి పదవ తరగతి అభ్యసిస్తున్న విద్యార్థులకు అవగాహన కల్పించటానికి వర్క్ షాపులు నిర్వహిస్తున్నామన్నారు. మనిషి దుస్తులు ధరించే అవసరం ఉన్నందున ఎంత సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందినా టెక్స్ టైల్ రంగానికి డిమాండ్ తగ్గదన్నారు. దేశంలో వ్యవసాయం తరువాత అతిపెద్ద స్థానంలో టెక్స్ టైల్ పరిశ్రమ ఉందన్నారు. రాష్ట్రంలో టెక్స్ టైల్ పరిశ్రమలు 18,507 చిన్నవి, 147 భారీ పరిశ్రమలు ఉన్నాయన్నారు. టెక్స్ టైల్ కోర్సులు అభ్యసించటానికి రాష్ట్రంలో గుంటూరు, మడకశిరలో టెక్స్ టైల్ టెక్నాలజీ పాలిటెక్నిక్ కళాశాలలు, విజ్ఞాన్ లో టెక్స్ టైల్ ఇంజనీరింగ్ కళాశాల అందుబాటులో ఉన్నాయన్నారు. పదవ తరగతి పాసైన తరువాత టెక్స్ టైల్ టెక్నాలజీలో డిప్లొమో చేసే అవకాశం ఉంటుందని, దీనికి ఏపీ పాలిసెట్ ద్వారా ఫిబ్రవరి, మార్చిలో నోటిఫికేషన్ జారీ చేసి పదవ తరగతి పరీక్షలు పూర్తి అయిన తరువాత మే నెలలో పరీక్ష నిర్వహించటం జరుగుతుందన్నారు. పదవ తరగతి సిలబస్ పై జరిగే ఈ పరీక్షలో 35 శాతం మార్కులు వస్తే టెక్స్ టైల్ టెక్నాలజీ కోర్సులలో సీటు సాధించవచ్చన్నారు. అర్హత సాధించి సీటు వస్తే ప్రభుత్వ ఫీజుతో ఉచితంగా కోర్సును అభ్యసించవచ్చని, అర్హత మార్కులు రాని వారు సైతం స్వంతంగా ఫీజు చెల్లించి కోర్సులో చేరవచ్చన్నారు. టెక్స్ టైల్ రంగంలో ఉన్న ఉద్యోగుల కొరత కారణంగా టెక్స్ టైల్ పరిశ్రమల అసోసియేషన్లు కోర్సులు అభ్యసించే విద్యార్థులకు అవసరమైతే ఫీజులు చెల్లించేందుకు ముందుకు వస్తున్నారన్నారు. అతి తక్కువ ఖర్చుతో ఈ కోర్సును అభ్యసిస్తూ పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకునే అవకాశం ఉందని, ఇంటర్న్ షిప్ నుంచే జీతాలు పొందే అవకాశం ఉందని, కోర్సు పూర్తి అయిన వెంటనే మంచి మెరుగైన జీతంతో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. కోర్సు పూర్తి అయిన వెంటనే టెక్స్ టైల్ పరిశ్రమలో సూపర్ వైజర్ ఉద్యోగాలు వస్తాయని, తరువాత ప్రొడక్షన్ మేనేజరు, టెక్నికల్ డైరక్టర్ తదితర పోస్టులలో పదోన్నతి పొందటంతో పాటు పరిశ్రమలో భాగస్వాములు వరకు ఎదిగే అవకాశం ఉందన్నారు. పరిశ్రమలో పనిచేసిన అనుభవంతో ప్రభుత్వం ఎంఎస్ఎంఈ లకు అందిస్తున్న పథకాలను వినియోగించుకొని టెక్స్ టైల్ పరిశ్రమను ఏర్పాటు చేసుకోని మరికొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించే వీలు ఉంటుందన్నారు. రాష్ట్రంతో పాటు గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల్లోను పరిశ్రమలను ఏర్పాటు చేసుకునే మంచి అవకాశం ఉందన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కాటన్ ఉత్పత్తిలో అగ్రగామిగా ఉందని, టెక్స్ టైల్ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయన్నారు. టెక్స్ టైల్ పరిశ్రమలో ఉద్యోగులకు ఉన్న డిమాండ్ కు అనుగుణంగా టెక్స్ టైల్ టెక్నాలజీ కోర్సులు అభ్యసించే వారు లేరని, అందువలనే విద్యార్థులకు ఈ కోర్సుపై అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు సైతం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సులే కాకుండా టెక్స్ టైల్, ఇతర కోర్సుల గురించి పూర్తి స్థాయిలో నిరంతరం అవగాహన కల్పించాలన్నారు. వర్క్ షాపు ద్వారా అవగాహన కలిగి టెక్స్ టైల్ కోర్సులపై ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి మరింత సమాచారం అందించి వారిని ప్రోత్సహించాలన్నారు. వర్క్ షాపులో ప్రభుత్వ టెక్స్ టైల్ టెక్నాలజీ ఇనిస్ట్యూట్ ప్రిన్సిపల్ కె మహమ్మద్, టెక్స్ టైల్ అసోసియోషన్ ప్రతినిధులు రఘురామిరెడ్డి, జోతిర్మయి టెక్స్ టైల్స్ మాజీ గ్రూప్ జనరల్ మేనేజరు బి వెంకటేశ్వర్లు, ఏటీఈ ఎంటర్ ప్రైజెస్ సెల్స్ మేనేజరు ఎం డీ ఖాదీర్ ఖాన్, అవర్స్ టెక్స్ టైల్ డైరక్టర్ ఎన్ నాగేశ్వరరావు లు టెక్స్ టైల్ టెక్నాలజీ కోర్సుల గురించి , టెక్స్ టైల్ పరిశ్రమలలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై వివరించటం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత జౌళి శాఖ అడిషల్ డైరక్టర్ ఏవీ పటేల్, జాయింట్ డైరక్టర్ కె కన్నబాబు, జోనల్ మేనేజరు బీమయ్య, ఏపి టెక్స్ టైల్స్ అసోసియేషన్ ఛైర్మన్ కోటి రావు, విజ్ఞాన్ విశ్వవిద్యాలయం సహాయ అచార్యులు శివ జగదీష్ కుమార్, టెక్స్ టైల్ మిల్లుల సంఘం ప్రతినిధులు రఘురాంరెడ్డి , జిల్లా విద్యాశాఖ అధికారి పి శైలజ, సమగ్ర శిక్ష ఏపీసీ బి విజయలక్ష్మీ, జిల్లా చేనేత, జౌళి శాఖ డైరక్టర్ వనజ, పారిశ్రామికవేత్తలు, యువతీ, యువకులు, కళాశాల, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.